PLATINUM JUBILEE YEAR

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపాదకుడు: నెల్లూరు శ్రీరామమూర్తి

జమీన్ రైతు

సంపుటి:76 సంచిక:9 4.3.2005 శుక్రవారం 12పేజీలు విడిప్రతి : రూ.3.00

డి.ఆర్.ఉత్తమలో విందుల పసందు

- బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు,కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్ టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో, అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)
- ప్రతి రోజూ వివిధ రకాల వెజ్&నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ. 160/-లకే

మరిన్ని వసతులతో మీకు స్వాగతం పలికే

మీ డి.ఆర్.ఉత్తమ ★ ★ ★ హోటల్

DR UTTHAMA ★★★ HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

విప్లవం అంటే విచక్షణ లేకుండా తలలు తెగనరకడమా?

నక్సలైట్లా? రాక్షసులా?

కర్నూలు జిల్లా వేంపెంట గ్రామంలో మావోయిస్టు నక్సలైట్లు జరిపిన ఊచకోత రాష్ట్రాన్ని భయకంపితం చేసింది. ఎనిమిది మంది నిరుపేద గ్రామీణులను ఒకరి తర్వాత ఒకరిగా; క్రూరంగా, పాశవికంగా, రాక్షసంగా నరికి చంపారువారు. రాజీ చర్చలని నమ్మించి; అడవులలోకి రప్పించి; విడి విడిగా మాట్లాడుతామని మోసపుచ్చి; ఒకరొకరిగా చెట్ల వాటుకు తీసుక వెళ్లి; గొడ్డళ్లతో తలలు ఛిద్రం చేశారు వారు. అంత తీరికగా, అంత నిదానంగా, ఒకరి తర్వాత మరొకరి తల తెగనరికారంటే - వారు మనుషులా, లేక కసాయితనం మూర్తీభవించిన దానవులా అన్న సందేహం కల్గుతుంది. ఏదో ఆవేశంలో, ఆగ్రహంతో తుపాకీ గుండ్ల వర్షం కురిపించి చంపడం వేరు; ఒక్కొక్కరిని పిల్చి, అదేదో మెడలో మాల వేసినంత సంతోషంగా తలలు తెగనరకడం వేరు. విప్లవ సిద్ధాంతం బదులుగా నెత్తుటి స్నానాలపై శిక్షణ ఇస్తున్నట్లుంది మావోయిస్టు నాయకత్వం.

ఈ దుశ్చర్యను సమర్థించుకోవడానికి ఎంత బలీయమైన కారణాలు చెప్పినా సభ్య సమాజం దృష్టిలో మాత్రం నక్సలైట్ల పట్ల ఏవ్యాభావం కల్గుతున్నది. దాని తీవ్రత తగ్గించడానికి కళ్యాణరావు వంటి మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు చేస్తున్న ప్రకటనలు మరింత అసహ్యం కల్గిస్తున్నాయి. విప్లవ పోరాటంలో వర్గ శత్రువులను సంహరించడం వేరు; గూండాతనంతో ప్రతీకార హత్యలు జరపడం వేరు. ఈ రెండింటినీ ఒక గాట కట్టడానికి ఎవరు ప్రయత్నించినా వారు కూడా సంఘ విద్రోహాల క్రిందే జమ పడతారన్నది నిజం. నక్సలైట్లు చంపిన వారెవరూ వర్గ శత్రువు నిర్వచనానికి సరిపోయే వారు కారు. పూటకు గతిలేని పేదలే అందులో అధికులున్నారు. ఇద్దరు దళితులు కూడా వున్నారు. దళితుల ప్రయోజనం కోసం దళితులను చంపడం అనే నూతన సామాజిక విప్లవ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు నక్సలైట్లు. పోనీ చంపిన వారిలో ఎవరైనా ఇప్పటికిప్పుడు నక్సలైట్లు లేదా వారి మద్దతు దారులకు ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారా అంటే - అదీ లేదు. ఎప్పుడో ఏదో తెలియని ఉన్మాదంలో జరిగిపోయిన సంఘటనలో పాల్పంచుకున్నారే తప్ప - వీరిలో ఎవరూ హింసా ప్రవృత్తి కల్గిన వారు లేరు. ఏ రకంగా చూసినా నక్సలైట్ల చర్య హేతుబద్ధం కాక పోవడమే కాదు - ఈసడింపదగినది కూడా.

ఈ దుశ్చర్య ద్వారా తాము రక్తం త్రాగే రాక్షస జాతికి చెందిన వారమన్న అభిప్రాయాన్ని ప్రజలలో కల్గించుకోడమే కాదు- ప్రభుత్వంతో జరుగుతున్న చర్చల ప్రక్రియకు కూడా తమంతట తాముగా అంతరాయం కల్పించుకున్నారు వారు. ఎంత పెద్ద ప్రళయం మీద పడినా చలించని హోంమంత్రి జానారెడ్డి కూడా ఆ దృశ్యాన్ని చూసి, చలించిపోయి; నక్సలైట్లపై మరొకసారి నిషేధం విధించే ప్రతిపాదనను పరిశీలిస్తామని ప్రకటించాడంటే - ఆ దుర్ఘటన ఎంతటి తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. నక్సలైట్లతో చర్చలు జరపాలి అనే వాదన ఎంత బలంగా వుందో; వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి అనే వాదన కూడా అంతే బలంగా వుంది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఎన్‌కౌంటర్లకు పాల్పడుతూ చర్చల వాతావరణాన్ని చెడగొడుతున్నది అనే అభిప్రాయం ఒకటి వుండేది. కానీ ఇప్పుడది మారిపోయింది. సగటు పౌరులు కూడా నక్సలైట్లను వారి ఇష్టానికి వదిలి వేస్తే లేనిపోని ప్రమాదాలు ఎదురౌతాయి అన్న అనుమానానికి గురౌతున్నారు.

ఈ మారిన ప్రజాభిప్రాయం రాష్ట్రంలో మరొకసారి యుద్ధ వాతావరణాన్ని రేకెత్తించే ప్రమాదం వుంది. ఒక్క వేంపెంట దుర్ఘటనే కాదు - ఆ తర్వాత కూడా నక్సలైట్లు వరసబెట్టి హింసకు పాల్పడుతున్నారు. బస్సులు తగల

తరువ 7వ పేజీలో

విద్యుత్ సమీక్షకు ముఖం చాటేశారు!

కొత్త విద్యుత్ చట్టం ప్రకారం ఏడాదికి ఒకసారి ప్రజా ప్రతినిధులతో సమావేశం జరపడం ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కర్తవ్యం. గత ఏడాది విద్యుత్ రంగంలో ఏమి జరిగింది; రానున్న సంవత్సరానికి ఎటువంటి విధాన నిర్ణయాలు తీసుకోవాలి; ధరల సవరణ ఎంత వరకు జరగాలి అన్న అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణకు ఈ కసరత్తు చేస్తారు. ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేయడానికి ప్రతిపక్షాలకు మహదవకాశం ఇది. గతంలో టిడిపి అధికారంలో వున్నప్పుడు కాంగ్రెస్ నేతలు దీన్ని బాగా వాడుకున్నారు. కానీ ఇప్పుడు తెలుగుదేశం మాత్రం ఇఆర్‌సి సమావేశాలకు రావడానికే భయపడి పోతున్నది. వారం క్రితం జరిగిన ఈ సమావేశానికి ఒక్క టిడిపి నేత కూడా హాజరు కాలేదు. మైసూరా రెడ్డి, పయ్యావుల కేశవ్‌లు ఇద్దరూ తాము సమావేశానికి వస్తామని ముందుగా నోటీసు ఇచ్చి; అనుమతి తీసుకున్నారట. కానీ ఆ సమయానికి అయిపు లేకుండా పోయారు. చంద్రబాబు సలహాయే అందుకు కారణమని చెప్ప

తరువ 7వ పేజీలో

లోపలొకటి; బయట వేరొకటి!

మాట మార్చడంలో, మాట నిలకడలేని తనంలో రాజకీయవాదుల ఖ్యాతి అందరికీ తెలిసిందే. ఎన్నికలలో వారికదొక సరదా. చెప్పేది చేయరు; చేసేది చెప్పరు. ఆ అలవాటు ప్రజలకే పరిమితం కావడం లేదు; అసెంబ్లీలో కూడా దాన్ని వదులుకోలేక పోతున్నారు. శాసనసభ సమావేశాలలో ఏయే అంశాలు ఏ రూపంలో ప్రస్తావించాలి అనే నిర్ణయం తీసుకోవడానికి బిజినెస్ అడ్వయిజరీ సమావేశం ఏర్పాటు చేయడం సాంప్రదాయం. స్పీకర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని ప్రధాన పార్టీల ఫ్లోర్ లీడర్లు హాజరౌతారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కూడా వస్తారు. అయితే చంద్రబాబు ఈ సమావేశాలకు దూరంగా వుంటున్నారు. తనకు బదులుగా యనమల రామకృష్ణుడు, దేవేంద్ర గౌడ్ వంటి వారిని పంపుతున్నారు. స్పీకర్ సమక్షంలో వివిధ అంశాలపై కాంగ్రెస్ ప్రతిపాదనలను వారు అంగీకరిస్తున్నారు. కానీ అక్కడ నుంచి బయటకు రాగానే లోపల చెప్పిన మాటకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. బిసిఎలో ఒప్పుకున్న ప్రకారం అసెంబ్లీ

తరువ 7వ పేజీలో

దూరమై పోతున్న మిత్రులు

ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గారు మెల్ల మెల్లగా ఒంటరి వాడై పోతున్నారు. స్వంత పార్టీలో ఆయన పరిస్థితి ఎంత మాత్రం బాగా లేదు. మంత్రివర్గ విస్తరణను విజయవంతంగా వాయిదా వేస్తూ వస్తున్నారు కాబట్టి అసమ్మతి స్వరాలన్నీ మూగపోయి వున్నాయి కానీ; లేకుంటే ఈ పాటికి కాకుల వలె కావు కావు మంటూ వుండేవారు కాంగ్రెస్ వాదులు. మంత్రి పదవులలో వుండేవారు, మంత్రి పదవులు వస్తాయన్న ఆశ కల్గిన వారు మాత్రమే ఇప్పుడు ముఖ్యమంత్రి వెంట వున్నారు. మంత్రిత్వాలు లేవు అని తేలిపోయిన ప్రక్క క్షణం వీరు, వారు కలిసి ఏదో ఒక వుపద్రవం సృష్టించడం ఖాయం. అది తెలిసే విస్తరణ జోలికి వెళ్లడం లేదు ముఖ్యమంత్రి.

మరోక ప్రక్క, ఎన్నికలలో కాంగ్రెస్ మిత్రపక్షాలుగా వుండిన సిపిఎం, మజ్లిస్ పార్టీలు దూరం జరిగి పోతున్నాయి. సిపిఎం పార్టీ నెల రోజుల క్రితం ఆ సంగతి తేల్చి చెప్పింది. అసెంబ్లీలో ప్రభుత్వ పక్షానికి తమ మద్దతు ఎంత మాత్రం దొరకదని స్పష్టం చేశారు బివి రాఘవులు గారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జరిపిన రాయబారాలు ఏవీ ఫలించలేదు. కాంగ్రెస్‌తో కలిసి వుంటే వారు చేసే తప్పుల పాపం తమకు చుట్టుకుంటుందన్న భయమే కమ్యూనిస్టుల ఆలోచనలలో మార్పుకు కారణం. అయితే అదృష్టవశాత్తూ సిపిఎం నేతలెవరూ తెలుగుదేశం పార్టీతో జతకట్టడానికి సిద్ధంగా లేరు. కేంద్రంలో మూడవ ప్రత్యామ్నాయ కూటమి అంటూ ఏర్పడి; అందులో చంద్రబాబు భాగస్వామ్యం తీసుకుంటే చెప్పలేము కానీ; ఇప్పటికిప్పుడు మాత్రం ఈ రెండు పార్టీల మధ్య మిత్రత్వం అంటూ ఏర్పడే అవకాశం కన్పించడం లేదు.

అయితే మజ్లిస్‌లు మాత్రం కాంగ్రెస్‌ను వదలడమే కాదు; తెలుగుదేశంతో చెట్టపట్టాలు వేసుకుని తిరిగేందుకు సుముఖంగా కన్పిస్తున్నారు. మొన్నటి ఎన్నికలలో కాంగ్రెస్, మజ్లిస్‌ల మధ్య అధికారికమైన ఎన్నికల పొత్తు అంటూ ఏదీ లేకపోయినా అనధికారిక అవగాహన నడిచింది. ఆసిఫ్‌నగర్ వుప ఎన్నిక వరకు ఇది కొనసాగింది కూడా. ఆసిఫ్‌నగర్‌లో మజ్లిస్ వత్తిడి మేరకే నాగేంద్రకు టిక్కెట్ నిరాకరించారన్నది బహిరంగ సత్యం. అంత బాగా దోస్తీ చేసిన మజ్లిస్ ఇప్పుడెందువల్లనో కాంగ్రెస్‌కు దూరం జరిగి పోతున్నారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీల సంక్షేమానికి తగినన్ని నిధులు ఇవ్వలేదని ఆరోపిస్తూ, ఎదురు దాడికి సిద్ధమౌతున్నారు.

ఒక్క సిపిఐ మాత్రం ఇప్పటి వరకు అటువంటి నిర్ణయాలు ఏవీ తీసుకోలేదు. ఒక రకంగా చెప్పాలంటే వారు పూగిన

తరువ 7వ పేజీలో


అవినీతికి పట్టాభిషేకం

రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వంలో ఐఎఎస్ అధికారులది ఇష్టారాజ్యంగా మారిందన్నది అందరెరిగిన సత్యం. పరిపాలన పట్ల ఆయనలోని అవగాహనా రాహిత్యాన్ని వారు ఎంతో బాగా సొమ్ము చేసుకుంటున్నారు. సిఎం పేషీని కులాల వారీ వర్గాలుగా చీల్చి; ఎవరి ప్రయోజనాలు వారు కాపాడుకుంటున్నారు. ఆ కోవకు చెందినదే - మార్కెటింగ్ డైరెక్టర్ డివిఎస్ మూర్తి గారికి రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా పదవీ ప్రమోషన్. అత్యంత వివాదాస్పద ఐఎఎస్ అధికారులలో

తరువ 7వ పేజీలో

కలెక్టర్ గారు ఎంత హుంకరించినా మునిసిపల్ గబ్బిలాలు బెదరడం లేదు

మన కలెక్టర్ రాజశేఖర్ గారిని చూస్తే పసి పిల్లలు కూడా పాలు త్రాగరని ప్రతీతి. ఎంతటి వారినైనా భయపెట్టి బాధ పెట్టడంలో ఆయనకు ఆయనే సాటి అని ప్రచారం. అందువల్లనే రాజకీయ వాదులంతా ఆయనతో పేచీ మానుకుని, పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. బయట పులుల వలె తిరిగే వారు కూడా కలెక్టర్ గదిలోపల పిల్లుల వలె తారాడుతున్నారు. పైపెచ్చు ఆయన నిప్పు వంటి నీతిపరుడు. నిప్పునైనా నివురు వుంటుంది కానీ తన నీతికి మచ్చ వుండదన్న గిర కలెక్టర్‌గారిలో స్పష్టంగా కన్పిస్తూ వుంటుంది. దాన్ని దాటుకోవడానికి ప్రతి అధికారిక సమావేశంలోనూ అవినీతిపరుల భరతం పడతాను అని హుంకరిస్తూ వుంటారాయన. ఇవన్నీ పత్రికలలో చదివే మనకు కలెక్టర్ గారి పాలనలో ధర్మం నాలుగు పాదాల నడుస్తుంది అనే భ్రమ కల్గడంలో ఏంతేమీ లేదు.



నెల్లూరు శాంతినగర్‌లో పారుదల కాలువ దురాక్రమించి కడుతున్న ఇల్లు

పులి గుహలో పిల్లి పిల్లలు చెర్లాటలాడుతాయని ఎవరైనా చెప్తే ఎట్లా నమ్మలేమో. కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్‌గా వున్న నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అవినీతి విచ్చలవిడిగా జరుగుతున్నదని ఎవరైనా ఆరోపిస్తే నమ్మడం అంతే కష్టం. కానీ అది నిజం. కలెక్టర్ గారి హుకుంలు, హెచ్చరికలు, బెదరింపులు, సస్పెన్షన్ భయాలు, కన్నెర్ర చేయడాలు వంటివన్నీ ఒట్టి ఉడత పూపులుగా మారిపోతున్నాయి. కలెక్టర్ నేతృత్వం కాబట్టి

వీధి దీపాలు, చెత్త తొట్ల పేరిట పాతిక లక్షల స్వాహా; కలెక్టర్ చెప్పాడని కాలువ పూడ్చి పారేసిన ఆక్రమణదారులు

తమనెవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో మరింత బరితెగింపుగా నడుస్తున్నది వ్యవహారం. మన కమిషనర్ గారు మహా సాధు పురుషుడు. నొప్పింపక, తానొవ్వక తప్పించుక తిరగాలన్న ప్రయత్నంలో వుంటారాయన. ఆ అతి మంచితనమే మునిసిపల్ కొంపను కొల్లేరు చేస్తున్నది. చోటా రాజకీయ వాదులు మునిసిపల్ ఆఫీస్‌ను తమ అడ్డాగా మార్చుకుని. కమిషనర్‌ను బెదరగొట్టి మరీ దోపిడీ ఆటలాడుతున్నారు.

టౌన్‌లో వీధి దీపాలకు సోడియం వేపర్ లైట్లు కొనుగోలులో ఇటువంటి కుంభకోణమే జరిగింది. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానంతో తయారయ్యే ఈ దీపాలను పెద్ద కంపెనీలు మాత్రమే తయారు చేయగలవు. చిన్నా చితకా వారు చేసే దీపాలు, వేయగానే మాడిపోతాయి; అధిక కరెంటు తీసుకుంటాయి; సక్రమమైన వెలుగు ఇవ్వవు. అందువల్ల పేరున్న పెద్ద కంపెనీల నుంచే వీటిని కొనాలన్నది నియమం. కమిషనర్ గారు అదే ప్రకారం పెద్ద కంపెనీల నుంచి వివరాలు సేకరించారట. ఈలోగా మునిసిపల్ చెట్ల మీద వేలాడే గబ్బిలాల వంటి రాజకీయవాదులు ఆయనపై వాలిపోయారు. తమ రాజకీయ పలుకుబడి ఎంత గొప్పదో; తమను కాదంటే అధికారులకు ఏగతి పడుతుందో అసలు సిసలు సంస్కృత భాషలో వివరించి చెప్పి; తాము చెప్పిన వారి నుంచే లైట్లు కొని తీరాలని పట్టుబట్టారట. వారిని తప్పించుకోవడానికి అప్పటికీ కమిషనర్ గారు క్వాలిటీ నిర్ధారణ లేకుండా కొనలేమని అభ్యంతరం చెప్పారట. అయితే వారి దబాయింపు ముందు అదీ నిలువలేదు. విజయవాడలో దొరికే నకిలీ దీపాలు తెచ్చి నెల్లూరులో చాన్నాళ్ల క్రితమే మూతపడిన ప్రకాష్ ఎలక్ట్రానిక్స్ అనే అంగటి బిల్లులు పెట్టి దాదాపు పాతిక లక్షల రూపాయలు భోంచేశారట. ఆ దీపాలు బిగించగానే మాడి పోతున్నాయి. స్తంభం పైకి ఎక్కి, బిగించే శ్రమ దండగ అని చెప్తున్నారు మునిసిపల్ కార్మికులు.

నరమాంసం మరిగిన పులికి, అవినీతి రుచి మరిగిన రాజకీయవాదికి పెద్ద తేడా వుండదు. ఇద్దరూ దాన్ని వదిలిపెట్టలేరు. వీధి దీపాలలో అంత వుట్ర వుడియంగా అన్నేసి లక్షల రాబడి రావడం చూసిన ఆ రాజకీయ గబ్బిలాలకు

తారువ 6వ పేజీలో

మాట తూలిన రంగయ్య - నిష్టూరపడిన మాగుంట!

ఆర్టీసి నెల్లూరు రీజియన్ ఛైర్మన్ పూసల రంగయ్య జిల్లా రాజకీయాలలో చిన్నపాటి కలకలం సృష్టించాడు. ఇది టీ కప్పులో తుఫాను వంటిదే అయినప్పటికీ ఇటు ముఖ్యమంత్రి, అటు పిసిసి అధ్యక్షుల స్థాయిలో ఫిర్యాదులకు దారితీసింది. రంగయ్యకు ఆయన వియ్యంకుడు కావలిలో ఒక సన్మాన సభ పెట్టారు. దానికి ఎమ్మెల్యేను కానీ, ఎమ్పీని కానీ పిలువలేదు. పార్టీ ప్రోటోకాల్ ప్రకారం అయితే అది తప్పు; కానీ కార్యక్రమం జరిపింది వియ్యంకుడు, ఇతర బంధువులే తప్ప పార్టీ కార్యకర్తలు కాదు కాబట్టి దాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఆ సభకు మాజీ ఎమ్మెల్యే కలికి యానాదిరెడ్డి గారు హాజరైనారు. రంగయ్య స్వతహాగా కొంచం మాటకారి. మైకు దొరికితే యిక చెప్పనే అవసరం లేదు. ఇటు పార్టీ టిక్కెట్ అటు కార్పొరేషన్ పదవులు రాకపోవడమే కాక; రానున్న శాసన మండలిలో సభ్యత్వం కూడా దొరకదేమోనన్న దిగులుతో



వున్న కలికి యానాదిరెడ్డి గారిని ఓదార్చాలన్పించినట్లుంది. అందుకు ఆయన్ను పొగిడితే సరిపోయేది. కానీ రంగయ్య మరికొంత దూరం వెళ్లి - జీవితమంతా పార్టీ కోసం కష్ట పడిన యానాదిరెడ్డి నోట దగ్గర కూడు డబ్బున్న వారు లాక్కొని పోయారని తీవ్ర స్వరంతో వ్యాఖ్య చేశాడు. కాంగ్రెస్‌లో డబ్బున్న వారికి దాస్యం చేసే దురలవాటు పెరిగిపోయింది; డబ్బు వుందని తెలిస్తే చాలు - పార్టీతో సంబంధం లేకపోయినా టిక్కెట్ ఇచ్చేస్తున్నారు; ఒకే ఇంట్లో ఒక ఎమ్పీ, ఒక ఎమ్మెల్యే టిక్కెట్ కూడా డబ్బు చూసే ఇచ్చారు; పార్టీ పోకడ ఇట్లా వుంటే యానాదిరెడ్డి వంటి



వారికి న్యాయం ఎక్కడ జరుగుతుంది? నాబోటి వారికి ఇక టిక్కెట్లు ఎప్పటికైనా ఎట్లా వస్తాయి. ఆ నిరాశతోనే నేను కూడా కాంగ్రెస్ వదిలి వెళ్లిపోవాలని అనుకున్నా; కానీ ఇన్ని రోజులు నమ్ముకున్న పార్టీని వదిలి పెట్టలేక వుండిపోయా... ఇదీ రంగయ్య ప్రసంగ సారాంశం. ఈ మాటలన్నీ పత్రికలలో ప్రముఖంగా వచ్చాయి. అవి పార్వతమ్మ మనసు గాయ పరిచినట్లున్నాయి. ఆ వార్తలు వచ్చిన పత్రికలన్నిటినీ చేత పట్టుకుని, నేరుగా ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లారామె. మీరు పదవులు ఇచ్చేవారు ఎట్లా మాట్లాడుతున్నారో చూడండి అని నిష్టూర పడ్డారు. పిసిసి అధ్యక్షుడు కేశవ రావుకు కూడా అదే మొస్తరు ఫిర్యాదు చేశారామె. అయితే ఆ ఇద్దరు నేతలు ఆమె చెప్పింది వినడం తప్ప బదులు చెప్పలేదు. నెల్లూరు జిల్లా ఎమ్మెల్యేలు ఇద్దరు ముగ్గురు మాత్రం రంగయ్య మాట్లాడిన మాటలను ఖండించి తీరవలసిందే అని గట్టిగా వాదించారట. వారి కష్టం వారిది.

పూసల రంగయ్య విమర్శల వల్ల మాగుంట పార్వతమ్మకు కానీ; ఎమ్పీ శ్రీనివాసులురెడ్డి గారికి కానీ జరిగే నష్టం ఏదీ లేదు. కానీ పార్టీలో ఇటువంటి బహిరంగ క్రమశిక్షణా రాహిత్యం వల్ల

తారువ 6వ పేజీలో



నేడు
మా
తొలి వార్షికోత్సవం!
మీ
ఆశీస్సుల
విజయోత్సవం!!
'రియల్ ఎస్టేట్ రంగంలో రియాలిటీకే రియల్ గుర్తింపు వుంటుందని ఋజువు చేసి, గత ఏడాది కాలంగా మమ్మల్ని, మా సంస్థను ప్రగాఢ విశ్వాసంతో, దృఢమైన నమ్మకంతో ఆదరించి, అభిమానించిన ప్రతి ఒక్కరికీ మా
ప్రథమ వార్షికోత్సవ విజయాభినందనాలు
మీ
వి.నాగేశ్వరరావు
SLS శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్
ప్రమోటర్స్ & బిల్డర్స్
మొదటి అంతస్తు, హోటల్ అభిరామ్, నెల్లూరు. ఫోన్- 5526777, సెల్-9849053994

ప్రథమ వార్షికోత్సవ కానుకగా
గూడూరు బైపాస్‌రోడ్డును ఆనుకుని
గోల్డెన్ గూడూరు
అత్యాధునిక D.T.P. లే అవుట
ఈరోజ నుండి బుకింగ్స్ ప్రారంభం
అత్యాధునిక సౌకర్యాలతో అందరికీ
అందుబాటు ధరలతో గూడూరులో
రూపుదిద్దుకుంటున్న ప్రప్రథమ
D.T.P. లే అవుట్
ఆదిశంకర ఇంజినీరింగ్ మరియు
నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలకు
అతి సమీపంలో అద్భుతమైన సుందర బృందావనం
'గోల్డెన్ గూడూరు'
వివరాలకు 98490 53994
Roopa Ads, 2323485

విజయ లేబొరేటరి
ఒబేసిటీ క్లినిక్ - 2000 A.D.
థైరోకేర్ - నెల్లూరు
మార్చి 8వతేది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా, థైరాయిడ్, గుండె మరియు లివరుకు సంబంధించిన 20 పరీక్షలు కేవలం Rs.500/-లకే చేయబడును.
స్థూలకాయులకు ఉచితంగా కౌన్సిలింగ్ చేయబడును. వెయిట్ రిడక్షన్ ట్రీట్‌మెంట్‌పై 20-50% డిస్కౌంట్ ఇవ్వబడును.
ఈ సదవకాశం మార్చి 15వరకు
డా॥ M. పెంచలరెడ్డి M.D., D.C.P.,
రోగ నిర్ధారణ శాస్త్రవేత్త మరియు స్థూలకాయం వైద్య నిపుణులు
ఇందిరాభవన్ రోడ్డు, నెల్లూరు.
ఫోన్: 0861-2324405,
సెల్: 9347104625

రాజకీయ ఘాతుకం

జార్ఖండ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదం అత్యంత ఘోరమైనది; క్రూరమైనది. జెఎంఎం అధినేత శిబూసోరెన్‌ను ముఖ్యమంత్రి పీఠంపై అధిష్ఠింప చేయడానికి అన్ని ప్రజాస్వామ్య సూత్రాలనూ గంగలో నిమజ్జనం చేసింది కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలలో శిబూసోరెన్ పార్టీకి కనీసపాటి మెజారిటీ కూడా రాలేదు. మొత్తం 81 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఆయన పార్టీకి వచ్చిన సీట్ల సంఖ్య కేవలం 17 మాత్రమే. వారి మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఆర్‌జెడిలకు కలిపి కూడా 33 దాటలేదు. అదే సమయంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు 36 స్థానాలు వచ్చాయి. ప్రభుత్వ ఏర్పాటుకు తగిన సంఖ్యాబలం ఇద్దరికీ రాని మాట నిజం. స్వతంత్రులు ఎవరికి మద్దతు ఇస్తే వారికి అవకాశం. అయితే ఐదుగురు స్వతంత్రులు ఎన్‌డిఎకు మద్దతు పలికారు. దానితో వారి బలం 41కి పెరిగింది. అంటే ప్రభుత్వ ఏర్పాటుకు వారినే పిలవడం గవర్నర్ ధర్మం. కానీ గవర్నర్ సయ్యద్ సిబ్తే రజీ అందుకు విరుద్ధంగా ప్రవర్తించాడు. స్వతంత్ర సభ్యులందరినీ తన దగ్గరకు పిలిపించుకుని; వారు శిబూసోరెన్‌కు మద్దతు పలికారని ప్రకటించి; ఆయన్ను రాజ్‌భవన్‌కు పిలిపించి; ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించి పోశాడు. అయితే స్వతంత్రులలో ఐదుగురు గవర్నర్ ప్రకటనతో విభేదించి, రాజ్‌భవన్ ఎదుట తమ నిరసన ప్రకటించారు. అయినా గవర్నర్ లెక్క చేయలేదు. పైపెచ్చు, అసెంబ్లీలో తన మెజారిటీ నిరూపించుకోవడానికి శిబూసోరెన్‌కు మార్చి 21తేది వరకు; అంటే ఇరవై రోజుల వ్యవధి కల్పించాడు. దాని అర్థం ఈ వ్యవధిలో ఆ స్వతంత్రులను చేజిక్కించుకునే అవకాశం ఇవ్వడం అన్నమాట.

అత్యంత క్రూరమైన రాజకీయ ఘాతుకం ఇది. గవర్నర్లు తమ అధికారాన్ని ఇట్లా దుర్వినియోగం చేయడం ఇదే ప్రథమం కాదు. కానీ ఎప్పుడు కూడా ఆ తరహా కుట్రలు ఫలించలేదు. ఇరవయ్యేళ్లనాడు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు ప్రభుత్వాన్ని కూలద్రోసి; నాదెండ్లను గద్దె ఎక్కించిన ఆనాటి గవర్నర్ రామ్‌లాల్‌కు ఏ దుర్గతి పట్టిందీ చరిత్రలో స్పష్టంగా నమోదై వుంది. అంత కఠినమైన అనుభవాలు వుండి కూడా జార్ఖండ్ గవర్నర్ అంత దుర్మార్గానికి ఒడిగట్టాడంటే చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోలేని అవిజ్ఞత ఆయన్ను ఆవహించిందనే భావించాలి.

ఇప్పుడు కూడా ఈ కుట్ర ఫలించే అవకాశమే లేదు. బిజెపి నేతలు దీన్ని ఒక సవాలుగా స్వీకరించారు. శిబూసోరెన్, ఆయన అనుచర బృందం ఎన్ని అవరోధాలు కల్పించినప్పటికీ ఐదుగురు స్వతంత్ర ఎమ్మెల్యేలను భద్రంగా ఢిల్లీ చేర్చగలిగారు వారు. రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌కు పరిస్థితి వివరించారు. రాష్ట్రపతి భవన్‌లో మొత్తం 41 మంది ఎమ్మెల్యేల చేత ఫిర్యాదు చేయించారు. దానితో రాష్ట్రపతి భవన్ నుంచి జార్ఖండ్ గవర్నర్‌కు హుకుం వెళ్లింది; బహుశా ఒకటి రెండు రోజులలోనే ఈ పొరపాటు సవరింపబడి, శిబూసోరెన్ పదవీ భ్రష్టత్వం జరిగి పోతుంది. ఆయన ముఖ్యమంత్రి భోగం నాలుగు రోజుల భోగాతంగా ముగిసిపోవడం ఖాయం. రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ వ్యక్తిత్వ వైశిష్ట్యం తెలిసిన వారెవరికైనా జరగబోయేది ఇదే అన్న సంగతి ప్రత్యేకంగా చెప్పబని లేదు.

ఈ మొత్తం వ్యవహారంలో ప్రజల చీత్కారానికి గురైంది గవర్నర్ కాదు; కాంగ్రెస్ పార్టీ, దాని అధినేత సోనియాగాంధీలు ప్రజల ముందు దోషుల వలె నిలబడవలసిన దుస్థితి దాపురించింది. పది నెలల క్రితం కేంద్రంలో ప్రధానిత్వాన్ని వదులుకుని; ఎంతో ముందాగా, వుదారత్వంతో ప్రవర్తించి; దేశ జనావళి అంతటి నుంచి ప్రశంసలు అందుకున్న సోనియాగాంధీ ఈ సంఘటనతో భ్రష్టుపట్టి పోయారు. కేంద్రంలోని మైనారిటీ సర్కారును కాపాడుకోవడానికి ఆమె చేసిన సరిదిద్దుకోలేని తప్పిదం ఇది. ఒక్క శిబూసోరెన్ వ్యవహారంలోనే కాదు; టిఆర్ఎస్ నేత చంద్రశేఖరరావు, డిఎంకె నియంత కరుణానిధి వంటి వారి విషయంలోనూ ఇదే తీరులో వుంది ఆమె వైఖరి. కేంద్రంలోని తన సర్కారును కాపాడుకోవడానికి ఎవరే కోరిక కోరినా కాదు, లేదు అనకుండా తీర్చాలన్న ఆమె తాపత్రయం ఇటు కాంగ్రెస్ పార్టీ పరువు తీయడమే కాకుండా; దేశంలో పలు అనర్థాలకు కారణభూతమౌతున్నది. మైనారిటీ ప్రభుత్వాల మనుగడకు కొన్నిసార్లు పరిస్థితులతో రాజీ పడడం తప్పనిసరి అన్నది నిజమే. కానీ దానికీ ఒక పరిమితి, హద్దు వుంటాయి. అధికారం కోసం అన్ని ఎల్లలు చెరపివేయడాన్ని ప్రజలు క్షమించరు అన్న వాస్తవం ఆమెకు అర్థం కావడం లేదు. దానివల్ల తాత్కాలికంగా ప్రయోజనం కలిగినా దీర్ఘకాలంలో ఇటు కాంగ్రెస్ పార్టీ, అటు దేశం కూడా పెద్ద మూల్యాన్నే చెల్లించవలసి వస్తుంది. ఆ కఠోర వాస్తవాన్ని ఆమె ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

జిమ్మిర్తైము

4-3-1955

పేజీలు:12 వెల: 0-2-0

సర్వేపల్లిలో గోపాలరెడ్డి మెజార్టీ 14వేలు!

సర్వేపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి బిజవాడ గోపాలరెడ్డి 14,339 ఓట్ల తేడాతో దిగ్విజయం పొందారు. వచ్చిన ఓట్ల వివరం దిగువ ఇస్తున్నాము.

మొత్తం ఓటర్లు	:	59,912
పోలయినవి	:	37,492
గోపాలరెడ్డి	:	25,381
బాలకోటారెడ్డి	:	10,942

నెల్లూరులో ఏసి మెజార్టీ 8వేలు

నెల్లూరు తమదేనని కమ్యూనిస్టులు డంబాలు కొట్టారు. గోబెల్స్ మించిన రకంగా మోస ప్రచారం జేశారు. 17.2.55తేది కమ్యూనిస్టు పత్రిక విశాలాంధ్ర ఈ విధంగా వ్రాసింది. డాక్టర్ పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి గారు 4వేల ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయం. కాంగ్రెస్‌వారు గూండా చర్యలు జరపడానికి శాయశక్తులా ప్రయత్నించారు. ఓటర్లను బోలింగుకు రానీకుండా దొడ్డిలో పెట్టాలని చూశారు. వారి ఎత్తులు పారలేదు. పేద ప్రజానీకం ఆ పన్నాగాలను భగ్నం చేసి వుత్సాహంతో పచ్చి కమ్యూనిస్టు అభ్యర్థికి ఓట్లు వేశారు. విశాలాంధ్ర ఈ విధంగా ప్రజల కండ్లు కప్పి వుండాలని చూసింది. నిజం ఈనాటికైనా బయట పడింది గదా! కాంగ్రెస్ అభ్యర్థి ఎసి సుబ్బారెడ్డి గారు కమ్యూనిస్టు అభ్యర్థిపై 8వేల మెజార్టీతో అఖండ విజయం సాధించారు. కాంగ్రెస్

50 శాతం పల్లె క్రితం

అభ్యర్థికి టౌన్‌లో 4334, గ్రామాలలో 3728 ఓట్లు మెజార్టీ వచ్చింది.

వెంకటగిరిలో వెంకటస్వామిరెడ్డి

వెంకటగిరి ద్విసభ్య నియోజక వర్గ ఓట్ల లెక్కింపు 3తేది రాత్రి పూర్తయ్యింది. కాంగ్రెస్ అభ్యర్థులు పాదిలేటి వెంకట స్వామిరెడ్డి (జనరల్) గారు 26,287 మెజారిటీతో, కమతం పణ్ముఖం (రిజర్వుడు) గారు 28,208 తేడాతో ఎన్ను గెలిచారు. రాష్ట్రం మొత్తంలో బంతి పెద్ద మెజారిటీ ఇప్పటి వరకు వీరిదే.

కనిగిరిలో యల్లమందారెడ్డి

కనిగిరిలో కమ్యూనిస్టు అభ్యర్థి జి.యల్లమందారెడ్డి 4788 మెజార్టీతో ఎన్నికయ్యారు.

సందిపాడులో వెంకటరెడ్డి

సందిపాడులో స్వతంత్ర అభ్యర్థి కాసం వెంకటరెడ్డి గారు 1893 ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు.

ఉదయగిరిలో కాంగ్రెస్ విజయం

ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థి మౌలా సాహెబ్ 596 ఓట్ల మెజార్టీతో విజయం పొందారు.

ఢిల్లీ రావలసిందిగా గోపాలరెడ్డికి పిలుపు

సంప్రదింపులకు ఢిల్లీకి రావలసిందిగా కాంగ్రెస్ అధ్యక్షుడు, గోపాలరెడ్డి గారిని ఆహ్వానించారని, వారు 8తేది ఢిల్లీ చేరుతున్నారని తెలుస్తున్నది.

సుందరయ్య గెలుపు

గన్నవరంలో కమ్యూనిస్టు అభ్యర్థి

తొరవ 10పేజీలో

ఇదేనా "చిదంబర" బడ్జెట్?

కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల వారికీ న్యాయం జరిగిందంటున్నారు. గ్రామాల్లో విద్య, వైద్యం, మంచినీటి సదుపాయాలకు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిధులు పెంచారు. వ్యవసాయ రంగంపై కూడా శ్రద్ధ చూపెట్టారు. అంత్యోదయ అన్న యోజన పథకాన్ని విస్తరించారు. పారిశ్రామిక రంగం కోసం కార్పొరేట్ పన్ను తగ్గించారు. కాని బడ్జెట్‌లో అన్నింటా వివాదాస్పదమైన అంశం బ్యాంకులో పదివేల రూపాయలు, అంతకు మించిన నగదు విత్‌డ్రాలపై పది రూపాయలు పన్ను విధించడం. నల్ల ధనాన్ని వెలికి తీయడానికి యుపిఏ ప్రభుత్వ కనీస ఉమ్మడి కార్యక్రమంలో వాగ్దానం చేసిన మాట వాస్తవం. కాని పదివేల రూపాయల విత్‌డ్రాలపై పన్ను విధించడం ద్వారా నల్లధనాన్ని ఎలా కని పెట్టగలుగుతారో చిదంబరానికే తెలియాలి. చిన్న మొత్తాలను పొదుపు చేసుకొని ఎదైనా అక్కర వచ్చినప్పుడు ఏక మొత్తంలో విత్‌డ్రా చేసుకొనే సగటు జీవులపైనా ఈ పన్ను పడుతుంది. ఇది పొదుపు సంస్కృతికి గొడ్డలి పెట్టు. ఈ పన్నును తక్షణం వుపసంహరించుకోవాలి.

నెల్లూరు — వి.అరుణకుమారి

జనవాణి

ధరలను అదుపు చేయండి

తమ ప్రభుత్వం ధరల అదుపుకు కట్టుబడి వుందని ఇటీవల ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కలకత్తాలో ప్రకటించారు. కాని ఇటీవల చక్కెర ధరలు ఆకాశాన్ని అంటాయి. ఉక్కు, సిమెంటు వాటితో సంబంధం కలిగిన వస్తువుల ధరలు పెరిగాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరుగుతూనే వున్నాయి. పై వస్తువులన్నీ సామాన్య, మధ్య తరగతి ప్రజలు వినియోగించేవే. ద్రవ్యోల్బణాన్ని అదుపులో వుంచామని గొప్పలు చెప్పుకోవడం ఇటీవల కాలంలో ఎక్కువయ్యింది. ద్రవ్యోల్బణం పెరిగితే ధరలు పెరుగుతాయని, తగ్గితే తగ్గుతాయన్నది నిజం కాదు. ద్రవ్యోల్బణం తగ్గటం అంటే ధరల పెరుగుదల రేటు తగ్గుతుందన్నది నిజం కాదు. ద్రవ్యోల్బణం తగ్గిందన్న కాలంలో గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా ఇరవై రూపాయలు ఎందుకు పెరిగింది? ప్రభుత్వనేతలు బుకాయింపులు మాని ధరలు తగ్గించేందుకు ఒక కార్యాచరణను ఇకనైనా రూపొందించాలి.

కావలి — వి.సుధీర్

తొరవ 10పేజీలో

ఇండియా-పాకిస్థాన్ సీరీసులో
కోట్లాది అభిమానులు కోరుకునేది
కళ్ళు చెదిరే 'సచిన్ బ్యాటింగ్ షాట్లు'
ఇండస్థలాల ఎంపికలో
సింహపురి ప్రజలు ఎల్లపుడూ ఇష్టపడేది
నాణ్యత గల 'యం.జి.బ్రదర్స్ ప్లాట్లు'



పూర్తి భద్రతతోపాటు అత్యంత నాణ్యత గల ఇండ్ల స్థలాలను
సొంతం చేసుకొనేందుకు యం.జి.బ్రదర్స్ వారి 4వ ప్రతిష్ఠాత్మక వెంచర్
సహజ ఎన్‌క్లేవ్ D.T.&C.P. Lay-out ను
సందర్శించి రూ.25000/-లు Booking Amount చెల్లించి చక్కటి ప్లాటును
రిజర్వు చేసుకోండి. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే!

M.G. BROTHERS REAL ESTATES
(A Division of M.G.Brothers Automobiles pvt. ltd.)
DARGAMITTA, NELLORE
వివరములకు మరియు సైటువిజిట్ కోసం తక్షణమే ఈ క్రింది మా Sr.మార్కెటింగ్ మేనేజరును సంప్రదించగలరు.
V.Venugopal, 98485 19515, 93471 07676

నెల్లూరు సంగతులు

పోలీసుతో పిల్లల కయ్యం

తల్లి, తమ్ముళ్ల అస్థి పంజరాలతో నాలుగు నెలల పాటు సహజీవనం చేసి ప్రస్తుతం తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్‌కుమార్, ప్రియలు పోలీసులతో నిత్యం తగాదా పడుతున్నారు. ఆస్పత్రిలో పోలీసులు వుంటే వైద్యం చేయించుకోమని, ఆత్మహత్య చేసుకొంటామని గందర గోళం చేస్తుండడంతో పోలీసులు సందిగ్ధంలో పడ్డారు. గతవారం అరుణ్‌కుమార్, ప్రియలు తాము చికిత్స పొందుతున్న రూముకు గడి పెట్టేశారు. బందోబస్తులో వున్న పోలీసులు తమను

అస్థిపంజరాల కేసు

వదలి వెళ్తేగాని తీయమని హఠం పట్టారట. ఆస్పత్రి వైద్యులు బ్రతిమలాడి, బామాలి మొత్తం మీద గడి తీయించారట. ప్రియ మానసికంగా కోలుకొందని నడవడానికి మరో నాలుగు వారాలు పడుతుందని రుయా ఆస్పత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ శేషమ్మ చెప్పారు. కంటికి రెప్పలా కాపాడుతున్న తమను అరుణ్, ప్రియలు అసహ్యించుకొంటున్న విషయాన్ని జిల్లా పోలీసులు, ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా వుండగా అస్థి పంజరాల పోస్టుమార్టం నివేదికలో మొదట వెంకటేష్ చనిపోయాడని తర్వాత తల్లి సాయిలీల చనిపోయినట్లు వెల్ల డయ్యింది. నాలుగు వారాల తర్వాత ఈ పిల్లలిద్దరినీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేస్తారు. ఆ తర్వాత వీళ్లను ఎక్కడ వుంచాలన్న విషయాన్ని పోలీసులు ఆలోచిస్తున్నారు.

పార్లుకట్టను కొల్లగొట్టారు

అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రైతులు స్వార్థంతో పెన్నానది పార్లుకట్టకు తూట్లు పెడుతున్నారు. గొల్లకందుకూరు నుంచి కోడూరుపాడు వరకు 35 కిలోమీటర్ల పరిధిలో పెన్నానది పార్లుకట్ట విస్తరించి వుంది. నెల్లూరు నగరంలో ఎక్కువైన అపార్టుమెంట్లు, ఇళ్ల నిర్మాణాలతో ఇసుక, మట్టికి మంచి డిమాండ్ వుంది. గతంలో 100 రూపాయలకు ట్రాక్టర్ తొట్టి నిండా తోలే మట్టి రేటు ప్రస్తుతం 300 రూపాయలు. ఈ మట్టి కోసం పెన్నానది వెల్లువ, గ్రామాల మీద పడకుండా నిర్మించిన పార్లుకట్టను ఇష్టానుసారంగా త్రవ్వి ధ్వంసం చేసి సొమ్ము చేసుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా పంచాయతీ, నీటి పారుదల, రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. గొల్లకందుకూరు, పొట్టేపాళెం, పల్లెపాళెం, ములుమూడి, దేవరపాళెం, కోడూరుపాడు, నవలాకులతోట గ్రామాల్లో పార్లుకట్ట

తొరవ 11వ పేజీలో



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో కొత్తగా కట్టిన ప్రెసిడెంట్స్ ఇన్ హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. ప్రక్కన మెట్టా చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి వున్నారు.

డాగ్ స్క్వాడ్ పారిపోయిందా?

ఈ మధ్య కాలంలో ఐదు మంది ఎస్పీలు మారారే గాని నెల్లూరులో నేరస్తులను పట్టుకొనేందుకు ఏర్పాటు చేయ తలపెట్టిన డాగ్ స్క్వాడ్ భవన నిర్మాణ పనులు మొదలు కాలేదు. డిజిపిగా దొర పని చేస్తున్నప్పుడు నెల్లూరు పర్యటనకు వచ్చి ఇక్కడ డాగ్ స్క్వాడ్ ఏర్పాటు చేస్తామని ప్రకటిం చారు. ఆ తర్వాత భవన నిర్మాణా నికి శిలాఫలకం వేసి సరిపెట్టు కొన్నారు. జిల్లాలో డాగ్ స్క్వాడ్ ఏర్పాటు ఆవశ్యకత ఎంతో వుంది. ఈ ఏడాది ప్రారంభం నుంచి జరిగిన హత్యలు, చోరీలకు పాల్పడిన నిందితులు పోలీసులకు పట్టుబడకుండా తెలివిగా నేరాలు చేశారు. నేర సంఘ టనల్లో పోలీసులకు నిందితుల ఆచూకీ తెలిసే ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో ఏ కేసులోనూ దర్యాప్తు ముందుకు సాగడం లేదు. హత్యలు, చోరీల్లో నిందితులను తెలుసుకొనేందుకు డాగ్ స్క్వాడ్ అవసరం ఎంతైనా వుంది. నేరస్తులు వుపయోగించిన కత్తులు, కర్రలు, రాడ్లు, బాంబులు, ఇతర మారణా యుధాలు, చేతిగుడ్డ, కాగితం, అగ్గిపెట్టె, సిగరెట్, చివరికి హతుడి శరీరం తాకినా పోలీసు జాగిలం వీటిని వాసన చూసి నేరస్తుడ్ని పసిగడతాయి. దీనివల్ల కేసుల దర్యాప్తు సులభతరమవుతుంది. జిల్లాలో జరిగే పలు దోపిడీలు, సంఘటనలను విశ్లేషిస్తే నేరస్తులు ఎక్కువగా రోడ్లపై రాళ్లను పెట్టి వాహన చోదకు లను దోచుకొంటు న్నారు. దోచు కొన్న తర్వాత చెట్లు, చేమలు, పొలాల మీదుగా నడిచి ఆ తర్వాత కొంత దూరంలో పెట్టుకొన్న వాహనాలెక్కి పరారవుతున్నారు. దోపిడీ జరిగిన వెంటనే పోలీసు జాగిలాన్ని రంగంలో దించితే సాధ్యమైనంత వరకు దొంగలు దొరికిపోతారు. విజయవాడ నుంచి పోలీసు జాగిలం రావడానికి 24 గంటలు సమయం తీసుకొంటుండ డంతో నెల్లూరు పోలీసులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. డాగ్ స్క్వాడ్ ఏర్పా టుకు ప్రజా ప్రతినిధులు గట్టి కృషి చేస్తే ఫలితముంటుంది.

నేతలూ పట్టుకోండి

బియ్యం దొంగల పని పడతా

గతంలో జిల్లాలో జరిగిన ఎస్‌జిఆర్‌వై పనుల్లో 8వేల మెట్రిక్ టన్నుల బియ్యం గల్లంతయ్యాయని దీనికి కారకులైన వారిపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బి.రాజశేఖర్ చెప్పారు. 1తేది కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌జిఆర్‌వై, ఇతర పథకాల అమలులో అనుసరించవలసిన మార్గదర్శకాలను కలెక్టర్, అధికారులకు చెప్పారు. ప్రజాప్రాముఖ్య వ్యవస్థలో పనిచేస్తున్న అన్ని సంస్థలలో ప్రతిరూపాంకి లెక్కలు వ్రాయ డం, జవాబుదారీతనం కలిగి వుండడం జరగాలి. అందుకు

కలెక్టర్ హెచ్చరిక

గాను స్పష్టమైన అవగాహనతో పటిష్టమైన వ్యవస్థ కలిగి వుండాలని, పర్యవేక్షక ఇంజనీర్లు బాధ్యతగా వ్యవహరించవలసి వుంటుందన్నారు. ఎస్‌జిఆర్‌వై పథకం అమలులో క్రింది స్థాయి నుంచి పర్యవేక్షక ఇంజనీరు వరకు వివిధ స్థాయిలలో ఎప్పటికప్పుడు సమీక్ష జరగాలి. అదేవిధంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన అధికారులు కూడా క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిలలో సమీక్షా సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీధర్, జడ్పీ సిఇఒ విశ్వనాథరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మోహన్ రావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ పర్యవేక్షక ఇంజనీరు సుబ్రహ్మణ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఈ గేట్లతో ఎన్నెన్ని పాట్లు

నెల్లూరు నగరంలోని ఏ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించను రైల్వే మంత్రి లాలు ప్రసాద్ యాదవ్ తన బడ్జెట్‌లో నిధులు విదిలించ లేదు. దీంతో నగరంలోని 12 రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద వాహన చోదకులు రైళ్లు వెళ్లే వరకు వేచి చూడక తప్పదు. వెంకటేశ్వరపురం, అయ్యప్పగుడి రైల్వే లెవల్ క్రాసింగ్ బ్రిడ్జిల నిర్మాణానికి గతంలో శంకు స్థాపనలు జరిగాయి. పనులు జరిగేందుకు నిధులే మంజూరు కాలేదు. ఈ రెండు రైల్వే క్రాసింగ్ గేట్లతో పాటు రంగనాయకుల పేట, విజయమహల్, కొండాయపాళెం, వేదాయపాళెం గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీ జాస్తి. విజయమహల్ గేటు వద్ద రైల్వే గేటు పడితే అటు, ఇటూ వందల కొలదీ వాహనాలు నిలచి పోతాయి. ఇక్కడ బాక్స్‌టైపు బ్రిడ్జి కట్టినా స్కూటర్లు, ఆటోలు, కార్లు మాత్రమే దీనిలో పోగలుగుతున్నాయి. వర్షం పడితే ఈ బాక్స్‌టైపు

తొరవ 11వ పేజీలో

పనిభారంతో సతమతం గ్యాస్ ఉంటే కిరోసిన్ తుస్

గ్రామ పంచాయతీ అధికారులకు రెవెన్యూ శాఖను కూడా కలిపి రాష్ట్ర ప్రభుత్వం పెను భారాన్ని మోపింది. గ్రామ కార్యదర్శులు వారంలో సోమ, మంగళ వారాలు అర్జీల సేకరణ, స్టాఫ్ మీటింగులతోనే సరిపోతూంది. మిగతా నాలుగు రోజులు అన్ని రకాల సర్టిఫికేట్లు

గ్రామ కార్యదర్శుల తిప్పలు

ఇవ్వాలి. ఇంటి పన్నులు, భూమి శిస్తులు వసూలు చేయాలి. భూమి తగాదాలు పరిష్కరించడంతో పాటు గ్రామాల్లోని జనన, మరణాలు నమోదు చేయాలి. వివిధ రకాల అర్జీల విచారణ చేయాలి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, రెవెన్యూ అధికారి ఎవరిమీటుకు వారు కార్యదర్శులపై అజమాయిషీకి ప్రయ త్నించి అసలే పని ఒత్తిడిలో వున్న కార్యదర్శుల్ని మానసిక ఒత్తిడికి కూడా గురి చేస్తున్నారు. పన్నుల వసూళ్లలో టార్గెట్‌లు పూర్తి చేయాలని ఆదేశిస్తు న్నారు. దీని మూలంగా గ్రామాల్లో గంద రగోళ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో పంచాయతీ కార్యదర్శిని, రెవెన్యూ కార్యదర్శిని వేర్వేరుగా నియమిం చాలి. ఎవరి పనులు వారికి నిర్దేశించాలి. పంచాయతీ కార్యదర్శి వ్యవస్థలోని ఆరోగ్య, సహకార, ఇతర వుద్యోగులను వారి మాతృసంస్థకు పంపాలి. ఈ వ్యవస్థ లను విభజిస్తే శిస్తులు, పన్నులు సక్ర మంగా వసూలవుతాయి. సర్టిఫికేట్లు, అర్జీల విచారణలో ప్రజలకు న్యాయం జరుగు తుంది. భూవివాదాలు, జల వివాదాలు త్వరగా పరిష్కారమవుతాయి. సర్వే పని, రెవెన్యూ పనులు తెలియని పంచాయతీ కార్యదర్శులు ఈ పని మూలంగా ఎన్నో

తొరవ 11వ పేజీలో

గ్యాస్ కనెక్షన్లు వున్న రేషన్ కార్డు దారులకు ఇక నుంచి కిరోసిన్ ఇచ్చే ప్రసక్తే లేదని ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయానికి ప్రజలు లబోదిబోమం టున్నారు. నెల్లూరు నగరంలో ఈ నెల నుంచే ఈ నిర్ణయాన్ని అమలు చేయను రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఒక సర్వే పూర్తి చేసి, పలువురు రేషన్ కార్డుదారుల నుంచి డిక్లరేషన్లు కూడా తీసుకొన్నారు. కార్పొరేషన్ పరిధిలో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రజలకు 10లీటర్లు, మునిసి పాలిటీల్లో ఆరు లీటర్లు, గ్రామాల్లో ఐదు లీటర్లు, దీపం పథకం క్రింద గ్యాస్ సిలిండర్ వున్న వారికి రెండు లీటర్ల కిరోసిన్ గతంలో పోసేవారు. ప్రభుత్వం ప్రకటించిన సరికొత్త విధానంలో దీపం కనెక్షన్ మినహా మిగతా తెల్ల రేషన్ కార్డులు కల్గిన వారందరికీ కిరోసిన్ కోటా కట్ చేస్తారు. గ్యాస్ సిలిండర్‌పై ప్రభు త్వం ఇప్పటికి 72 నుంచి 90 రూపా

సరికొత్త నిర్ణయం

డిపాజిట్ మొత్తంతో పాటు సిలిండర్‌ను ప్రభుత్వం వెనక్కు తీసుకొంటుంది. నెల్లూరు నగరంలో ఇప్పటికే పది మం దిపై ఈ చర్య తీసుకొన్నారు. వీరికి భవిష్యత్తులో గ్యాస్ కనెక్షన్ కూడా ఇవ్వరు. నెల్లూరు నగరంలో లక్షా 14వేల గ్యాస్ కనెక్షన్లు వుండగా 64వేల మంది తెల్లకార్డు లపై కిరోసిన్ తీసుకొంటున్నట్లు అధికా రులు లెక్కలు తేల్చారు. ఈ కొత్త నిర్ణ యం వల్ల వెనువెంటనే నగరాలలో కిరోసిన్ కోటా తగ్గిపోనుంది. మధ్య తరగతి యులు గ్యాస్ సిలిండర్ల ధర పెరగడంతో కార్డులపై తెచ్చుకొన్న కిరోసిన్‌తో నీళ్లు కాచుకోవడంతో పాటు, గ్యాస్ అయి నప్పుడు ప్రత్యామ్నాయంగా కిరోసిన్ స్టౌను వినియోగించేవారు. కొత్త నిర్ణయం ఆ అవకాశం లేకుండా చేసింది. మొత్తం మీద నెల్లూరు కార్పొరేషన్ అయ్యాక నగర ప్రజలకు కిరోసిన్ కోటా 'కట్' అయినా అదనపు సౌకర్యం లభించింది. ప్చ్... ఏం చేద్దాం!

జూబ్లీ హాస్పిటల్‌పై లోక్‌సత్తా నిఘా!

నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద వున్న జూబ్లీ హాస్పిటల్‌పై 26తేది లోక్‌సత్తా నిఘా వేసి పలు అవకతవకలు గమనించి సరిదిద్దుకోమని సలహా ఇచ్చారు. శిక్షణ పొందిన సిబ్బంది లేని

తొరవ 11వ పేజీలో

జిల్లా వార్తలు

ఎసిబి వేలలో లంచాల చేప

నెల్లూరియుు, కర్నూలు ఆర్‌అండ్‌బి శాఖ కార్యాలయంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అలంకారం శ్రీనివాసరాజు అవినీతికి పాల్పడుతూ ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. నెల్లూరులో శ్రీనివాసరాజుకు చెందిన కోటి రూపాయలకు పైగా వున్న ఆస్తుల్ని సీజ్ చేశారు. అలంకారం శ్రీనివాసరాజు 1974లో గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం తాత్కాలిక ఉద్యోగంలో చేరి 1976లో పర్మినెంట్ అయ్యారు. జిల్లాలోని పంచాయతీ

నెల్లూరులో పడింది

రాజ్, తెలుగుగంగ, సోమశిల ప్రాజెక్టు విభాగాలలో పనిచేసి కొద్ది రోజుల క్రిందట కర్నూలుకు బదలీ అయ్యి వెళ్లారు. ఆర్‌అండ్‌బి శాఖ కావడంతో కాంట్రాక్టర్ల నుంచి ప్రతి బిల్లు మంజూరుకు ఒక శాతం పర్సంటేజి తీసుకొనేవాడు. పర్సంటేజి ఇవ్వనిదే బిల్లులు పాస్ చేసేవాడు కాదు. అవినీతి ఆర్జనతో భక్తవత్సలనగర్‌లోని ఆర్టీఏ కార్యాలయం ఎదుట 50 లక్షల విలువ చేసే నాలుగంతస్తుల భవనాన్ని నిర్మించాడు. ఈ భవనాన్ని ఎసిబి అధికారులు చౌదరి, అల్లాబక్షు, వీరాంజనేయరెడ్డి పరిశీలించగా 80 గ్రాముల బంగారు నగలు, 4

తొరవ 12వ పేజీలో

కాసుల బేరం పూసలకు తెలుసా?

నెల్లూరు ఆర్టీసి జోనల్ ఛైర్మన్ పూసల రంగయ్య పేరు చెప్పి ఆయన సన్నిహితులు, బంధువులు కొందరు ఉద్యోగాలిప్పిస్తామని పైకం వసూలు చేశారని గోలగా వుంది. ఇటివల ఆర్టీసి డ్రైవర్ల నియామకాల విషయంలో పలుచోట్ల ఈ వసూళ్లు చేశారట. కావలి పట్టణంలో ఇది మరీ జాస్తి. ఇక్కడ పూసల రంగయ్య వియ్యంకుడు ఈ పనికి పాల్పడినట్లు విన్పిస్తుంది. ఒక్కో డ్రైవర్ పోస్టుకు 40 వేల రూపాయల నుంచి 60వేల రూపాయల వసూలు చేశారట. ఉద్యోగాలు వస్తే అది తమ ఘనతేనని ఆ డబ్బును తొక్కేశారు. ఉద్యోగాలు రాని వాళ్లకు, వాళ్లు రచ్చ చేసే వాళ్లయితే సగానికి సగం

కావలిలో గగ్గోలు

మినహాయించుకుని మిగిలిన పైకం ఇచ్చేసి, వచ్చే దఫా ఇంటర్వ్యూలలో సాయం చేస్తామని చెబుతున్నారట. పూసల రంగయ్యకు ఈ విషయం తెలుసో లేదో కానీ, తెలిసి వుంటే జాగ్రత్త పడటం మంచిది. లేకపోతే లేనిపోని అనుమానాలు, అపోహలకు అవకాశం ఇచ్చినట్టవుతుంది.

గూడూరు మునిసిపల్ సమావేశం

గూడూరు మునిసిపల్ సమావేశం ఫిబ్రవరి 28తేది ఛైర్మన్ కోడూరు కల్పలత అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలు చర్చకు రాకమునుపే కొళాయిల్లో వస్తున్న మురుగు నీటిని ఒక సీసాలో తీసుకొచ్చి సిపిఎం కౌన్సిలర్ వెంపలూరు ఆదెమ్మ సమావేశంలో చూపెట్టారు. పట్టణంలో తాగునీటి సరఫరా చేసే వాటర్ వర్క్స్ విభాగంలో వున్న మోటార్ల గూర్చి సభ్యులు విపరాలడిగారు. వాటర్ వర్క్స్ విభాగంలో 18 మోటార్లున్నాయని, కొన్ని మరమ్మత్తులకు వెళ్లాయే తప్ప దుర్వినియోగం కాలేదని ఛైర్మన్ స్పష్టం చేశారు. వివిధ వార్డుల్లో అక్రమ కొళాయిల విషయమై తెలుగుదేశం పక్ష నాయకుడు నెల్లూరు రమణారెడ్డి ప్రశ్నించారు. పండపరకు వున్నాయని మునిసిపల్ అధికారులు లెక్కలు తేల్చారని, వీటిని క్రమబద్ధీకరించాల్సి వుందని ఛైర్మన్ చెప్పారు. గూడూరు టౌన్‌లో పలు వార్డుల్లో వీధిలైట్లు వెలగడం లేదని 12వవార్డు కౌన్సిలర్ నారాయణమ్మ ధ్వజమెత్తారు. మోటార్ల విషయంలో ఛైర్మన్ సమాధానం పరిలేదని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వాకిటి నాగులు, శ్యామ్, రమణయ్య సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు.



పేద పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయించే నిమిత్తం ఏర్పాటైన నెల్లూరులోని చిన్నారి వార్ట్ ఫౌండేషన్ ఛేర్మన్ కె.వి.రత్నంకు లక్ష రూపాయల విరాళాన్నందిస్తున్న నెల్లూరు మాజీ ఎమ్మెల్యే జె.కె.రెడ్డి.

సింగిల్ ఫేజ్‌లో త్రీ ఫేజ్ అవినీతి

కావలి ట్రాన్స్‌కో అధికారులు కాంట్రాక్టు పనులలో పెద్ద ఎత్తున అక్రమాలకు శ్రీకారం చుట్టారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆత్మకూరులోని రీకో సంస్థను ప్రభుత్వం మూసేసి ట్రాన్స్‌కోలో విలీనం చేసి దాని నిర్వహణ బాధ్యతలను కావలి డీఇకి అప్పగించింది. రీకో పరిధిలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా చేసేందుకు ట్రాన్స్‌కో 1.30 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. కావలి ట్రాన్స్‌కో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనులను విభజించి తమకు అనుకూలురైన కొందరు నెల్లూరు కాంట్రాక్టర్లకు ఈ పనులు అప్పచెప్పి ముడుపులు దండుకొన్నట్లు స్థానిక కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కోలో చిన్న పనైనా టెండరు పిలిచి పనులు చేపట్టాలని ట్రాన్స్‌కో సిఎండి రేచల్ ఛటర్జీ ఆదేశించినా ఆమె ఆదేశాలను బేఖాతరు చేసి జిల్లా అధికారులు ముడుపులకు ఆశపడి ఇష్టానుసారం పనులు కట్టబెట్టారని ఆరోపణలు విన్పడుతున్నాయి. ఈ విషయమై జమీన్‌రైతు విలేకరి ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్‌ని వివరణ కోరగా ఎంత మంజూరయ్యిందీ తనకు తెలియదని టెండర్లు పిలిచింది, లేనిదీ కూడా తెలియదని బాధ్యతా రహితంగా సమాధానం ఇచ్చారు. జిల్లా అధికారికి తన శాఖ పరిధిలోనికి వచ్చే విషయాన్నే ఏమి జరుగుతుందో తెలియదనడం దారుణం. ట్రాన్స్‌కో సీఎండి ఈ వ్యవహారం పై పూర్తి స్థాయిలో విచారణ చేపడితే కాని వాస్తవాలు వెలుగులోకి రావు.

కావలి ట్రాన్స్‌కో దుస్థితి

ఆదిశేషయ్య ఉద్యోగ విరమణ

చిన్న చెరుకూరు కేంద్రంగా దాదాపు 40 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కె.ఆదిశేషయ్యను 27తేది టిఆర్‌ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సన్మానించారు.

తొరవ 8వ పేజీలో

పరీక్షలంటే టీచర్లకు భయమా?

డిఇఓ విదరింపుతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ప్రధానోపాధ్యాయులు పదవ తరగతి పరీక్షలంటే భయపడిపోతున్నారు. సహజంగా పరీక్షలు సమీపిస్తున్నాయంటే విద్యార్థులలో కొంత భయం, ఆందోళన వుంటుంది. పరీక్ష ప్రశ్నాపత్రం ఎలా వస్తుందోనన్నది వారి ఆందోళనకు కారణం. కాని ఇపుడు విద్యార్థులకు బదులుగా ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. దీనికి కారణం డిఇఓ కృష్ణారావు జిల్లాలో మూడు డివిజన్‌లలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యా

డిఇఓ హుకుంతో దడ

యులతో సమావేశాలు ఏర్పాటు చేసి పదవ తరగతి/పరీక్షల్లో ప్రతి పాఠశాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 80గా వుండాలని హుకుం జారీ చేయటమే. విద్యా సంవత్సరం మొదట్లో సమావేశాలు పెట్టి పాఠశాలలో సమస్యలను పరిష్కరించి, అవసరమైన ఉపాధ్యాయులను నియమించి 80శాతం ఉత్తీర్ణత సాధించాలని టార్గెట్ విధించడం సముచితం. అలా చేయకుండా పరీక్షల సమయంలో టార్గెట్ విధించారంటే దానర్థం ఏమిటి? పరీక్షల నిర్వహణలో ఉదాసీనంగా వ్యవహరించడం, దగ్గరుండి కాపీలు ప్రాయించడం, బిట్ పేపర్ చెప్పడం అనే

తొరవ 8వ పేజీలో

యువశక్తికి వార్ధక్యం

రాజీవ్ యువశక్తి పథకానికి బాలారిష్టాలు తగిలినట్లున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో ఈ పథకం క్రింద ఎంపిక పూర్తి కాలేదు. నవంబరు 19తేది ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పథకానికి కుప్పలు తెప్పలుగా దరఖాస్తులొచ్చి పడ్డాయి. జిల్లాలో 1,780 మంది లబ్దిదారులను ఎంపిక చేయాల్సి వుండగా దరఖాస్తులు 16,193 అందాయి. ఈ పథకంలో మూడు కేటగిరీల క్రింద రుణాలను అందజేయాల్సి వుంది. గ్రూపు, వ్యాపార, వ్యక్తిగత రుణాలు ఈ పథకంలో ఇవ్వాలి. వ్యక్తిగత రుణాలకు అధిక పోటీ నెలకొని వుంది. 178 మందికి లక్ష రూపాయల చొప్పున వ్యక్తిగత రుణాలివ్వాల్సి

ఎంపిక లెప్పుడు?

వుంది. అయితే దరఖాస్తులు 7,976 వచ్చాయి. మండలాల వారీగా లబ్దిదారుల ఎంపికకు మండల అభివృద్ధి అధికారులు చాలా చోట్ల లేకపోవడం విఘాతంగా పరిణమించింది. 12 మండలాల్లో ఇన్‌ఛార్జీల పాలన కొనసాగుతుండడంతో ఎంపిక గందరగోళంగా తయారయ్యింది. మండలాల్లో ఎంపిక చేసిన జాబితా ఆధారంగా తుది జాబితా ప్రకటించాలి. ఈ జాబితా ఎమ్మెల్యేలు చెప్పినట్లు తయారయ్యిందన్న విమర్శలున్నాయి. గ్రూపు రుణాల ఎంపికలోనూ గందరగోళాలు చోటు చేసుకొన్నాయి. మొత్తం మీద జిల్లాలో ఈ పథకమే పలు ఆటుపోట్లు ఎదుర్కొంది. పరిస్థితి కుదుటపడి ఈ పథకం ద్వారా యువకులు ఎప్పుడు లబ్ధి పొందుతారో?

ప్రస్తుత ఆధునిక సమాజంలో యాంత్రిక జీవనశైలికి అలవాటుపడి తీవ్రమైన శారీరక, మానసిన ఒత్తిడులకు గురి అవుతున్న వారికి చక్కని పరిష్కారమే **యోగా** మరియు **ప్రకృతి వైద్యం.** ప్రతిఒక్కరి శారీరక, మానసిక ఒత్తిడుల విముక్తికై బొల్లినేని హాస్పిటల్స్ వారి సారధ్యంలో నూతనంగా ప్రారంభించబడింది.

బొల్లినేని యోగా & నేచర్ క్యూర్ హాస్పిటల్

ధనలక్ష్మీపురం, ముత్తుకూరు రోడ్డు, నెల్లూరు.

ఈ శుభసందర్భముగా మార్చి 1వ తేది నుండి 31 వరకు

ఉచిత యోగ & నేచర్ క్యూర్ క్యాంప్

ప్రతిరోజూ ఉ॥ 5.30 నుండి సా॥ 6 గం॥ల వరకు





ప్రకృతి వైద్య విధానాలు : జలవైద్యం, యోగ చికిత్స, ఆక్యుపంక్చర్, వ్యాయామ చికిత్స, మృత్తికా వైద్యం, మర్దనా వైద్యం, అయస్కాంత చికిత్స, ఆహార వైద్యం, రేకి & ప్రాణ చికిత్స.

చికిత్స చేయబడు వ్యాధులు : బి.పి., షుగర్, ఆస్థ్మా, అధికబరువు (ఒబెసిటి), కీళ్ళవ్యాధులు, వెన్నునొప్పి, వివిధ రకముల తలనొప్పులు, ఎంగ్జైటి, డిప్రెషన్, Menstrual Diseases, గ్యాస్ట్రిక్ ప్రాబ్లమ్స్, సైనుసైటిస్.

వివరములకు: డా॥ A. పసుబి, B.N.Y.S. యోగా & ప్రకృతి వైద్య నిపుణులు | డా॥ A. కృష్ణకుమార్, B.N.Y.S. యోగా & ప్రకృతి వైద్య నిపుణులు

ఫోన్ : 0861-2366430, సెల్ : 9848679588

ఉచిత బస్సు సౌకర్యము కలదు.

HARSHA ADS 98491 88889

వెల్కం టు నెల్లూరు

డాక్టర్ అనిల్‌కు మెడికల్ కౌన్సిల్ సభ్యత్వం

నెల్లూరు డయాబెటిస్ వ్యాధి నిపుణుడు డాక్టర్ ఐసనాక అనిల్‌కుమార్‌రెడ్డి జాతీయ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైనారు. ఐదేళ్ల పాటు కొనసాగుతారు. ప్రతిష్టాకరమైన పదవి ఇది. మెడికల్ కౌన్సిల్ అంటే వైద్య రంగంలో అత్యున్నత సంస్థ. కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చేది వారే. పాత కాలేజీలలో సీట్ల సంఖ్య పెంచాలన్నా వారి అనుమతి అవసరం. ఏ కాలేజీలో నైనా బోధన, ఆస్పత్రి నిర్వహణ సరిగా లేవు అని వారు నిర్ధారిస్తే ఆ కాలేజి గుర్తింపు రద్దు అయిపోతుంది. అందువల్ల ముఖ్యమంత్రి స్థాయిలో సంబంధాలు వుంటాయి ఈ సంస్థ సభ్యులకు. మెడికల్ కాలేజీలు ఎంత పెద్ద వ్యాపారమో తెలిసిన సంగతే కదా? అందువల్ల ఆ సంస్థ సభ్యత్వం ఎక్కడో ఢిల్లీలో వున్నత స్థాయిలో పలుకుబడి కల్గిన వారికి మాత్రమే లభిస్తుంటుంది. అటువంటి ప్రతిష్టాకర సభ్యత్వం అనిల్‌కు తెచ్చి ఇచ్చింది కేంద్రమంత్రి పనబాక లక్ష్మి. జిల్లాలో ఆమె చేస్తున్న పదవుల పంపకంలో అతిపెద్దది ఇదే. పనబాక లక్ష్మి సిఫార్సు లేకుంటే జరిగే పనికాదు అన్నది నిజమే అయినా - ఆ పదవికి అన్ని విధాల తగినవాడు అనిల్. చిన్న వయస్సులో పెద్ద పదవి పొందిన అనిల్‌కు మా హృదయ పూర్వక అభినందనలు.

ఎస్వీయు పాలకవర్గంలో గోపాలకృష్ణమూర్తి

విఆర్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గోపాలకృష్ణమూర్తిని ఎస్వీ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడిగా నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. యూనివర్శిటి స్థాయిలో ఇది వరకు సిండికేట్, సెనేట్ అనే సంస్థలు వుండేవి. వాటిని రద్దు చేసి ఇప్పుడు పాలక మండలి అనే కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. అందులో సభ్యుడైనాడాయన. గోపాల కృష్ణమూర్తి గారు అందుకు అన్ని విధాలా తగిన వ్యక్తి. చదువు, సంస్కారం, అనుభవం, అవగాహన పుష్కలంగా కల్గిన వాడు; వివాదాలకు చాలా దూరం. అందరితో మంచిగా వుండే నైజం. అందువల్లనే ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయినా తర్వాత కూడా కాలేజి నిర్వహణ బాధ్యత మొత్తం ఆయనకే అప్పచెప్పాడు వివేకానందరెడ్డి. ఈ పదవి కూడా ఆయన సిఫార్సు చేతితోవచ్చిందే. గోపాలకృష్ణమూర్తి గారికి మా అభినందనలు.

పోలీసుల జీతాలపై సిఎంకు ఉత్తరాలు

పోలీసు కానిస్టేబుళ్ల జీతభత్యాలు పెంచమని కోరుతూ జిల్లా పోలీసు అధికారుల సంఘం నేతృత్వంలో జిల్లా నుంచి రెండువేల మంది పోలీసులు ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు వ్రాశారు. పోలీసులు రోజుకు 16 గంటలకు పైగా పనిచేస్తున్నా, 8 గంటలు పని చేస్తున్న ప్రభుత్వ వుద్యోగుల కంటే జీతాలు తక్కువగా వున్నాయని జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీహరి ఆరోపించారు. ఈ పుర్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారుల సంఘం విస్తరించనుంది. ఈ పుర్యమానికి నెల్లూరు నుంచే శ్రీకారం చుట్టడం విశేషం.

బైనుల వితరణ

సామాజిక సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించేందుకు నెల్లూరు నగరంలోని బైనులు సదా సిద్ధంగా వుంటారు. గుండె జబ్బులతో బాధపడే పేద పిల్లలకు ఆపరేషన్లు చేయించే నిమిత్తం ఏర్పాటైన చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌కు 3తేది పెద్ద మొత్తంలో విరాళాలందించారు. మండపాలవీధిలోని బైన మందిరంలో ఒక సభ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమ సూత్రధారి, చిన్నారి హార్ట్ ఫౌండేషన్ అధినేత కెవి రత్నంను సన్మానించారు. ఈ సందర్భంగా బైన్ సిల్వర్ ప్యాలెస్ అధినేత శంకర్‌లాల్ బైన్ లక్ష 11వేలు, శాంతిలాల్ బైన్ లక్ష రూపాయలు అందజేశారు. సూర్యలోక్ మంగీలాల్‌జీ, గోల్డ్ ప్యాలెస్ అశోక్ చెరి 51వేలు ఇచ్చారు. రతన్ జ్యూయలరీ అధినేత గెవర్‌చంద్ 41వేలు, గోల్డన్ జ్యూయలరీ అధినేత పరస్మల్ 25వేలు, జిజిఎన్ గోల్డ్ అధినేత గులాబ్‌చంద్‌జీ బైన్ 25వేలు, గోల్డన్, ముఖేష్, సత్యాస్, సత్యం జ్యూయలరీ అధినేతలు తలా 25వేలు ఇచ్చారు. మొత్తం మీద బైన మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ ఖాతాలో 6లక్షల 4వేల రూపాయలు జమ అయినట్లు ఛేర్మన్ కెవి రత్నం చెప్పారు.

జర్నలిస్ట్ ఐ.వి.రావు మరణం

సీనియర్ జర్నలిస్ట్, నెల్లూరు యుఎన్ఐ విలేకరి, ఐ.వి.రావు (55) ఈ రోజు (4తేది) బొల్లినేని హాస్పిటల్‌లో మరణించారు. ఆయన గత కొంత కాలంగా అస్వస్థులై వున్నారు. ఐవి రావు - ఈనాడు, ఉదయం పత్రికల్లో పెద్ద హోదాల్లో పనిచేశారు. ప్రఖ్యాత చరిత్ర పరిశోధకుడు ఇంగువ కార్తికేయ శర్మకు ఐవి రావు సోదరుడు.

***

నెల్లూరు ట్రంకురోడ్డులోని ప్రముఖ స్టేషనరీ షాపు రాజేశ్వరి పేపర్ ఎంపోరియం అధినేత వీరభద్రరావు సతీమణి విజయకుమారి (57) ఫిబ్రవరి 20తేది మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు.

ఆత్మీయులను కోల్పోయిన పై కుటుంబాల వారికి మా సానుభూతి.

పూసల రంగయ్య

2వ పేజీ కొరవ

కార్యకర్తలకు తప్పుడు సలహాలు అందుతాయి. ముఖ్యమంత్రి వంటి వారు ఈ విషయంలోనే జాగ్రత్త పడవలసి వుంటుంది. అయినా రంగయ్య చేత మాట మార్పించడం ఎంత పని?

కలెక్టర్ గారు

2వ పేజీ కొరవ

మునిసిపల్ ఆఫీసు భలే నచ్చింది. వెనువెంటనే టౌన్‌లో చెత్తతొట్ల నిర్మాణం అని ఒక పని సృష్టించారట. ఒక్కొక్క తొట్టికి ఐదు నుంచి ఏడు వేల రూపాయల అంచనా వేయించి; అందులో పాతిక భాగం ఖర్చుతో నాసిరకం తొట్లు కట్టి; బిల్లు తీసుకున్నారు. ఈ రూపంలో మునిసిపల్ ఖజానాకు అక్షరాలా ఐదు లక్షల రూపాయలు హారతి కర్పూరం అయ్యాయి. దానితోనూ దాహం తీరినట్లు లేదు; ఆత్మకూరు బస్టాండు ఫ్లై ఓవర్ బ్రిడ్జి క్రింద అందం కోసం గడ్డి పెంచడానికి మట్టి తోలకం పేరుతో మరొక ఐదు లక్షలకు బిల్లు పెట్టారట.

వీరు తెచ్చి ఇచ్చే బిల్లులను గంటల వ్యవధిలో మంజూరు చేస్తున్నారు కమిషనర్ గారు. అందులో ఏమాత్రం ఆలస్యం అయినా ఆ రాజకీయ గబ్బిలాలు భరించలేనంత ఆగం చేస్తున్నాయట. పెద్ద పెద్ద వాళ్ల పేర్లు చెప్పి మరీ బెదరిస్తున్నారట. ఆ పెద్ద వాళ్లకు వీరికి ఎప్పటి సాన్నిహిత్యమోనని మునిసిపల్ కాంగ్రెస్ వాదులకు తలలు బ్రద్దలు కొట్టుకుంటున్నా అర్థమే కావడం లేదు. నిజంగా సాన్నిహిత్యం వుందో లేక చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముతున్నారో కూడా తెలియడం లేదు. ఈ గబ్బిలాలను మునిసిపల్ ఆఫీసు నుంచి ఎంత త్వరగా తరిమి వేస్తే ఇటు కలెక్టర్ గారికి అటు కాంగ్రెస్ నేతలకు అంత మేలు. లేకుంటే అందరి పరువూ బజారున పడుతుంది.

మునిసిపల్ వ్యవహారాలలో కలెక్టర్ గారి భయం పనిచేయడం లేదు అనే ఆవేదన తప్ప; ఆయన వల్ల జరుగుతున్న ప్రత్యక్ష నష్టం ఏమీ లేదు. కానీ టౌన్‌లో కొన్ని భూఆక్రమణలలో మాత్రం కలెక్టర్ గారి పేరు ప్రత్యక్షంగా దుర్వినియోగం అవుతున్నది. ఫత్తేఖాన్‌పేట తర్వాత; శాంతినగర్‌లో అటువంటి సంఘటన ఒకటి కన్పిస్తున్నది. నెల్లూరు చెరువు నుంచి కస్తూరిదేవి విద్యాలయం మీదుగా శాంతినగర్, ఫత్తేఖాన్ పేటలకు ఒక పంట కాలువ పారుతున్నది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని ఈ కాలువ క్రింద భూములన్నీ ఇళ్ల స్థలాలుగా మారిపోయాయట. దానితో ఆ కాలువ నిరుపయోగమై పోయింది. నీళ్లు లేని కాలువ ఎందుకు అని కస్తూరిదేవి విద్యాలయం యాజమాన్యం తమ ఆవరణం లోపల ఆ కాలువను పూడ్చి వేసింది. అది పూర్తిగా వారి ఆవరణం లోపలి భాగం కాబట్టి; అక్కడ ఇతరులెవరికీ ఎటువంటి ప్రమేయం లేదు కాబట్టి; పైగా అది ప్రజా ప్రయోజన పంస్థ కాబట్టి వారి చర్యను ఎవరూ తప్పించలేదు. కానీ వారి ప్రహరీ దాటిన తర్వాత ఆ కాలువ ఇళ్ల మధ్యలో పడుస్తుంది. శాంతినగర్‌లో అంకణం స్థలం యాభై వేలకు పైమాటే. కొందరు భూ ఆక్రమణదారులు, అదును చూసి, ఆ కాలువను పూడ్చివేసి, ఇళ్లు కట్టుకోవడం ప్రారంభించారు. విడబ్ల్యుడి అధికారులు, మునిసిపల్ అధికారులు కలిసి వెళ్లి ఒకసారి ఆ నిర్మాణాన్ని కూలద్రోశారట. కానీ తర్వాత రెండు రోజులకే మళ్లీ కట్టడం ప్రారంభించారు. ఈసారి మరింత పకడ్బందీగా, చుట్టూ తెర ఏర్పాటు చేసుకుని మరీ ఇళ్లు కడుతున్నారు. మునిసిపల్ సిబ్బంది వెళ్లి అడ్డగించబోతే కలెక్టర్ గారు తమకు అనుమతి ఇచ్చారని; జాయింట్ కలెక్టర్ స్వయంగా అక్కడకు వచ్చి మరీ చెప్పి వెళ్లారని దబాయిస్తున్నారట ఆ ఆక్రమణదారులు. దానితో పెద్ద వారితో కూడిన వ్యవహారమని మునిసిపల్ సిబ్బంది మౌనంగా వుండిపోయారు. ఆ ఆక్రమణ విలువ పదిహేను లక్షల పరకు వుంటుందని అంచనా.

ఎంత వరకు నిజం ఇది? టౌన్‌లో రోడ్డుకు అడ్డంగా వున్నట్లు తెలిస్తే పట్టా స్థలాలు అని కూడా చూడకుండా కూల గొడుతున్న కలెక్టర్ గారు ఒక ఆక్రమణదారుకు అనుమతి ఇస్తారంటే నమ్మగలమా? ఆ ఆక్రమణదారుడికి వున్నతాధికారులకు గల సంబంధం ఏమిటి? ఎంత సంబంధం వుంటే మాత్రం కలెక్టర్ గారు తన నియమాలను తానే ఉల్లంఘిస్తారా? నమ్మలేము. కలెక్టర్ గారు ఆ స్థలం పరిశీలించి, ఆ ఆక్రమణదారును నివారిస్తే ఈ అనుమానాలు తొలగి పోతాయి. ఆయన అందుకు సిద్ధపడుతారో లేదో వేచి చూద్దాం. దీన్ని నివారించలేకుంటే మాత్రం ట్రంకు రోడ్డుతో సహా టౌన్‌లో మరెక్కడా ఏ రోడ్డు ఆక్రమణనూ నిరోధించే, నివారించే అధికారం కోల్పోతారు అధికారులు.

Before The 2nd Addl. Motor Accidents Claims Tribunal :: Nellore

O.P.No: 610/2003

Indela Krishna Reddy... Claimant

Vs.

1.V.Aruna and another... Respondent

NOTICE

R1.V.Aruna, W/o Narothama Reddy, Owner of the Bus. residing at 16/1767, Ramamurthy Nagar, Nellore.

పై నంబరున పిటిషనరుకు బస్సు ప్రమాదంలో దెబ్బలు తగిలినందున నష్టపరిహారములు కోరుచూ పై కోర్టులో పిటిషనరు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో మీకు నోటీసు నిమిత్తం తే18-3-2005దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30గంటలకు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు పరోక్షమున తీర్మానించబడును.

B. RAMA RAO,
Advocate for the Claimant, Nellore.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: GUDUR

O.S.No: 76 of 2003

State Bank of India, A.D.B.Podalakur... Plaintiff

Vs.


Y.Bhaskar Reddy & another... Defendants

NOTICE

To 2nd Defendant, Yenuga Penchalareddy, S/o.Ramireddy, Yeturu Village &Post, Chejerla Mandal, Nellore Dist.

Please take notice that the above suit is posted for your appearance on 11-3-2005 and therefore you are hereby summoned to appear before the above court at 10-30 a.m. on the said date failing which exparte orders follow.

Y.V.CHANDRA SEKHAR,
Advocate for Plaintiff



మా ప్రియ నెల్లూరీయునికి శుభాకాంక్షలు

అత్యంత ప్రతిష్టాత్మకమైన **మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా** కు 5సం॥ల పాటు కౌన్సిల్ మెంబర్‌గా ఆంధ్ర ప్రదేశ్ నుండి ఏకైక డాక్టరుగా నియమితులైన మా ఆత్మీయులు, ఎందరో డయాబెటిక్ పేషంట్లకు విశిష్ట వైద్య సేవలందిస్తున్న

డాక్టర్ అనిల్ కి

మా హృదయ పూర్వక శుభాభినందనలు



శ్రీమతి పనబాక లక్ష్మి
కేంద్ర మంత్రివర్యులు

డా॥ పుచ్చలపల్లి మిత్ర, FRCS
కిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్

డా॥ డి.జనార్దనరెడ్డి, MS. M.Ch.,
విజయ హార్ట్ ఫౌండేషన్, చెన్నై

డా॥ పి.రాజశేఖర్‌రెడ్డి, MS. FRCS
విజయ హెల్త్ సెంటర్, చెన్నై

డా॥ ఎం.విజయకుమార్, M.D., D.M
విజయ హార్ట్ ఫౌండేషన్, చెన్నై

డా॥ వై.విజయచంద్రారెడ్డి, M.D., D.M. MRCP
విజయ హార్ట్ ఫౌండేషన్, చెన్నై

డాక్టర్ బి.అనిల్ కుమార్ రెడ్డి
అనిల్ డయాబెటిస్ సెంటర్, పాగాతోట, నెల్లూరు

నక్సలైట్లా?

మొదటి పేజీ కొరవ

నిట్టతం; ఐఏఎస్ అధికారులను చంపడం; తెలుగుదేశం, కాంగ్రెస్ గ్రామ స్థాయి నాయకులను నరికి పారేయడం వంటివి ప్రతిరోజూ పత్రికలలో చూస్తూనే వున్నాం మనం. మరోపక్క పోలీసు ఎన్‌కౌంటర్లు కూడా నిత్య వార్తలై పోయాయి. ఈ ఘర్షణ ఆగాలంటే చర్చలు ఒకటే మార్గం. కానీ చర్చల వల్ల నక్సలైట్లు మరింత బలపడి, ముందు ముందు మరిన్ని హింసాయుత సంఘటనలతో ప్రజా జీవితాన్ని అశాంతిమయం చేస్తారు అనే అభిప్రాయం వెళ్లునుకోవతంతో ప్రభుత్వం కూడా చర్చలకు వెనుకా ముందు ఆడవలసి వస్తున్నది. చర్చలకు ఎంతో ఒత్తిడి తెచ్చిన పీస్ ఇనిషియేటివ్ వంటి సంస్థలు, ఎస్ఆర్ శంకరన్ వంటి మధ్యవర్తులు సైతం మెల్లమెల్లగా ప్రక్కకు తప్పుకుంటున్నారు. వేంపెంట దుర్ఘటన తర్వాత అటువంటి వారెవరికీ నక్సల్స్‌కు అనుకూలంగా మాట్లాడేందుకు నోరు కూడా రాకపోవచ్చు. ఈ అవకాశాన్ని నక్సల్స్‌తో యుద్ధం కోరుకునే పోలీసు అధికారులు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రమాదం కన్పిస్తున్నది. మధ్యవర్తుల కంటే ఇటువంటి అతివాద పోలీసు అధికారుల మాటకే ప్రభుత్వం అధిక విలువ ఇవ్వక తప్పని స్థితి నెలకొంటే రాష్ట్రంలో మరొకసారి యుద్ధం తప్పదు. దానివల్ల ఎవరికి నష్టం ఎవరికి లాభం అన్నది వేచి చూడవలసిందే. అది తేలేవరకు నక్సల్ ప్రభావిత జిల్లాలలో ప్రజాజీవితం మాత్రం నిత్య అశాంతిమయం అవుతుంది అన్నది మాత్రం నిజం.

మిత్రులు

మొదటి పేజీ కొరవ

లాటలో వున్నట్లు కన్పడుతున్నది. త్వరలో రానున్న మునిసిపల్ఎన్నికలలో ఏ పార్టీతో చెలిమి మంచిది, లాభకరము అన్న అంచనాను బట్టి వారి ధ్రాసు మొగ్గు తెలుతుందని చెప్తున్నారు.

ఏది ఏమైనా ఎన్నికలు జరిగి పట్టుమని పది నెలలు కాకముందే మిత్ర పక్షాలను దూరం చేసుకోవడం రాజశేఖర రెడ్డి చేస్తున్న తప్పిదం. రాష్ట్రంలో కమ్యూనిస్టులకు స్వంతంగా గెలిచే బలం లేకపోయినా ఓడించే శక్తి వుంది. దానికి మించి ప్రజా వుద్యమాల నిర్మాణంలో వారి ప్రాబల్యం తక్కువగా చూడలేము. కమ్యూనిస్టులు కత్తి కట్టారంటే ఎటువంటి ప్రభుత్వాన్ని అయినా వూదర పెట్టియగలరు. మునిసిపల్ ఎన్నికల వరకైనా వారితో మంచిగా వుండగలిగితే కాంగ్రెస్‌కు, రాజశేఖరరెడ్డికి కూడా క్షేమం. ఆ సూచన కన్పించడం లేదు.

పట్టాభిషేకం

మొదటి పేజీ కొరవ

ప్రథముడు - డివిఎస్ మూర్తి. ఆయన ఎక్కడ పనిచేస్తే అక్కడొక అవినీతి పుట్ట తయారౌతుంది. దేవాదాయ శాఖలో ఆయన తప్పిదాలు సస్పెన్షన్ వరకు దారితీశాయి. అయితే సీనియర్ ఐఎఎస్ అధికారులు ఎస్‌వి ప్రసాద్, కెవి రావు ఆయన సమీప బంధువులు. మాజీ ఐపిఎస్ అధికారి రంగయ్య నాయుడు కుటుంబ సభ్యుడు. ఈ అండ చూసుకుని ఆయన తన పై అధికారులను, మంత్రులను కూడా పట్టించుకోకుండా వ్యవహరిస్తుంటాడు. ఆయన తప్పులకు శిక్ష పడకుండా కుటుంబ సభ్యులు చూస్తుంటారు. ఇప్పుడాయనకు రిటైర్‌మెంట్ దగ్గర పడింది. అయినా ప్రభుత్వ సుఖాలు వదలడం ఇష్టం లేదు. దానితో ఆయన గాడ్‌ఫాదర్లు అందరూ కలిసి ఆయన్ను అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడిగా ప్రతిపాదించారు. ఆ పదవి ఐదేళ్ల పాటు వుంటుంది. రిటైర్‌మెంట్‌తో సంబంధం లేదు. అక్కడ నిస్పృహతో ట్రిబ్యునల్ అంటే వుద్యోగుల సమస్యలను విచారించి తీర్పు చెప్పేది. తిన్న వారికి తిన్నంత సొమ్ము దొరికి బంగారు గని. రిటైర్‌మెంట్ తర్వాత కూడా ఆయన బూరెల బుట్టలో పడబోతున్నాడన్న మాట. ముఖ్యమంత్రికి అధికారుల మీద కనీసపాటి అజమాయిషీ వుంటే ఇటువంటి ప్రతిపాదనలను దగ్గరకు కూడా రానివ్వరు. అది లేదు కాబట్టి అవినీతికి పట్టాభిషేకం చేస్తున్నారాయన.

విద్యుత్

మొదటి పేజీ కొరవ

న్నారు. ఇఆర్‌సి సమావేశాలకు వెళ్తే; గతంలో తెలుగుదేశం చేసిన విద్యుత్ ఒప్పందాలు, నిర్ణయాలు ప్రస్తావనకు వస్తాయని; వాటికి సమాధానం చెప్పే పరిస్థితి లేనందువల్ల ఆ సమావేశాన్ని విస్మరించడమే మంచిదని చంద్రబాబు అభిప్రాయ పడ్డారట. సిపిఎం, బిజెపి వంటి ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఇఆర్‌సికి వచ్చి; విద్యుత్ రంగంపై తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పి వెళ్లారు. సిపిఎం నేత బివి రాఘవులు గారు చేసిన ప్రసంగం; ఇచ్చిన సమాచారం అందరి ప్రశంసలు పొందింది కూడా. దురదృష్టవశాత్తు ఒక్క కాంగ్రెస్ వాది కూడా దీనికి హాజరు కాలేదు. విద్యుత్ వంటి కీలక అంశాలపై అధ్యయనం చేసే ఓపిక, అవగాహన వారిలో లేకపోవడం అందుకు కారణం కావచ్చు. వారి పుణ్య కాలమంతా టెండర్లు, బదిలీలతోనే సరిపోతున్నది. ఏది ఏమైనా ప్రతిపక్షంలో వుండి, ప్రభుత్వ విమర్శలను ఎదుర్కోలేని బలహీన పరిస్థితిలో పడిపోవడం తెలుగుదేశం పార్టీ దురదృష్టం. వారు చేసిన పాపాలు అటు వంటివి మరి.



నెల్లూరు మూలపేటలోని లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, స్కూల్ కరస్పాండెంట్ చాట్ల నరసింహారావు.

బయట వేరొకటి

మొదటి పేజీ కొరవ

లోపల నడుచుకోవాలని స్పీకర్ ఎంత గొంతు చించుకుని అరిచినా ప్రయోజనం వుండడం లేదు. తాను బిసిఎకు రాలేదు కాబట్టి, తనకు ఆ హామీలతో సంబంధం లేదన్నట్లు చంద్రబాబు ప్రతిరోజూ సభ లోపల అల్లరి చేస్తున్నారు. ఇదేమి పద్ధతయ్యా బాబూ అని మరుసటి బిసిఎ సమావేశంలో యనమలు రోశయ్య వంటి వారు అడిగితే; గతంలో మీ రాజశేఖరరెడ్డి కూడా ఇదే చేశారు కాబట్టి, తమ నాయకుడు చంద్రబాబు కూడా ఆ బాణీలోనే వెళ్తున్నాడని వాదిస్తున్నారట. దానితో అసెంబ్లీ సమావేశాలు అల్లరిమయం అవుతున్నాయి; ఎంతో సమయం వృధా అవుతున్నది. చంద్రబాబు కొంచం సాంప్రదాయబద్ధంగా, ప్రజాస్వామ్య యుతంగా వ్యవహరిస్తే మన శాసనసభ విలువ ఎంతో పెరుగుతుంది. కానీ ఆ అవకాశం కన్పించడం లేదు. బీహార్‌కు మనకు పెద్దగా తేడా లేదిప్పుడు. అరుచుకోవడం, నిందలేసుకోవడం, మైకులు విరుచుకోవడం తప్ప ఫలప్రదమైన చర్చలు అరుదై పోతున్నాయి.

వధువు కావలెను

రెడ్డి, 28. 5'11" హైదరాబాద్‌లో స్థిరపడిన అందమైన MDS డాక్టరు వరునకు, Any professional or P.G.Degree చదివిన సాంప్రదాయ కుటుంబానికి చెందిన అందమైన 5'4" పైన ఎత్తుగల రెడ్డి వధువు కావలెను. పూర్తి వివరాలతో నేరుగా సంప్రదించండి.

సెల్ : 9849253729
e-mail: reddys_0102@usa.net

తృతీయ వర్ధంతి



కీ.శే॥ మోపూరు పెంచలయ్య, IRTS
Senior DCM (Rtd.)
S.C.Rly. Vijayawada.

భువి నుంచి దివి కేగిన మానవతామూర్తి మా ఇంటి వెలుగు, మా దైవం **శ్రీ మోపూరు పెంచలయ్య** గారు మమ్మలను వీడి నేటికి మూడేళ్లు గడిచినానే మా హృదయాలలో నిత్యం జీవిస్తుంటారు. దివి నుంచి దీవించే దీవెనలే మా అభివృద్ధికి సోపానాలు. వారి ఆత్మకు శాంతి కలిగించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కుటుంబ సభ్యులు...

జమీన్‌రైతు

తెలుగు వార పత్రిక

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పాగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 2327354



ఒక చందాతో రెండు లాభాలు!

- ఏడాది పాటు పత్రికా పఠనం
- 600ml "సెల్లో" ఇన్సులేటెడ్ వాటర్ బాటిల్ బహుమానం



కేవలం రూ.150లు

జమీన్‌రైతు సంవత్సర చందాగా చెల్లించిన వారికి ఈ నూతన సంవత్సర కానుక సమర్పిస్తున్నాము!
(1-12-2004 నుండి 31-3-2005 వరకు మాత్రమే)

చందా చెల్లించిన వెంటనే రశీదు తోపాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

నిజాలకు వార్తా ప్రతిబింబం **నిర్భీతికి సజీవ సంకేతం!**

అంతర్గత మెట్లు!

వై.విశ్వేశ్వరాచారి నిజాంపట్నం

* మా యింట్లో ఉత్తరం మెట్లున్నాయి. లోపలి భాగంలో నైరుతిలో మెట్లున్నాయి. ప్లాను పంపిస్తున్నాను.

ఉత్తరం మెట్లు వాయువ్యంలో రావచ్చు. ఉత్తరం హద్దులో నిషేధం. అంతర్గత మెట్లు నైరుతిలో అసలు రాకూడదు.

వి.పావని పెనుకొండ

* ఇంటి సింహ ద్వారానికి రెండు వైపులా కిటికీలు తప్పనిసరా? ఒక్క పైనా పర్వాలేదా? వివరించండి?

వాస్తు సందేహాలు-సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్ : 0861-2338159
4వ వీధి, గాయత్రినగర్,
ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4

సింహ ద్వారానికి రెండు వైపులా కిటికీలు మంచిదే. కనీసం ఒక్క పైనా రెండు కిటికీల పాటిది అమర్చాలి. ఇందువల్ల 'అంధక దోషం' వుండదు.

ఆర్.భవానీదేవి విజయవాడ

* దేవాలయాలకు కొన్ని దిక్కుల్లో గృహ నిర్మాణాలనెందుకు నిషేధించారు? వాస్తులో ఈ కారణం సరియైనదేనా?



హైదరాబాద్‌లోని విశ్వభారతి ఫౌండేషన్ నిర్వహించిన స్టేట్ వైడ్ టాలెంట్ టెస్ట్‌లో సెవెన్త్ క్లాస్ విభాగంలో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన రత్నం హైస్కూల్ విద్యార్థిని, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుమార్తె సాయి వైష్ణవికి బహుమతినిస్తున్న మాజీ ఎమ్మీ వేణుగోపాలాచారి, రచయిత్రి కె.వి.కృష్ణకుమారి.

దేవాలయాలకు తూర్పు, ఉత్తరాల్లో గృహాల్ని నిషేధించారు. అయితే విశ్వామిత్ర, భరద్వాజ, అగస్త్య వాస్తులలో ఒక్కో శాస్త్రం ఒక్కో విధంగా చెప్పింది. అయితే ఆలయ గోపుర ఛాయ నివాస గృహాలపై పడకూడదన్న అంశంలో అందరిదీ ఏకాభిప్రాయమే!

కె.అచ్యుతరెడ్డి కావలి

* శంకుస్థాపన స్థానాన్ని గూర్చి చాలా తేడాలున్నాయంటారు. వీటిలో శ్రేష్ఠమేది?

శంకుస్థాపన నిర్మాణాలకు మధ్య స్థానంలోనూ, ఉచ్ఛ దిగ్బంధంలోని ఈశాన్యంలోనూ చేయవచ్చని శాస్త్రాలు చెప్పాయి. అయినప్పటికీ ఈశాన్యం ఉత్తమోత్తమం.

పి.రజనీకుమార్ గూడూరు

* తూర్పు భాగంలోని చెట్లను కొట్టివేయవచ్చా? ఎటి చెట్లను పెంచకూడదు?

తూర్పు ఈశాన్యంలో చెట్లేవైనా వుండరాదు. తూర్పు భాగంలో పూజకు పనికి వచ్చే పూలమొక్కలున్నప్పుడు వాటిని కొట్టక పోయినా పర్వాలేదు.

జి.పెద్దబ్బాయి నెల్లూరు

* తులసి కోట కొలతలుగా ఎటి ద్వారాలు రాకూడదు?

తులసి కోటకెదురుగా తూర్పు ఆగ్నేయం దక్షిణ, పశ్చిమ నైరుతి, ఉత్తర వాయువ్య ద్వారాలు రాకూడదు.

టీచర్లకు భయమా

5వ పేజీ కొరవ

కదా అని పలువురు ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. దీనిని బట్టి పరీక్షలను జిల్లాలో ప్రభుత్వమే ప్రహసనంగా మార్చనున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టార్గెట్ సాధించని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ కట్ చేయడం, మెమోలు ఇస్తానని డిఇఓ బెదరించడంతో పిల్లలకు బదులు ఉపాధ్యాయులు పరీక్షలను తలచుకొని హడలి పోతున్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి

మానవుడు ఆరోగ్యవంతమైన జీవనం గడపాలంటే అవసరమైన మేరకు పౌష్టికాహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని హైదరాబాద్‌లోని జాతీయ పౌష్టికాహార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బాబు పేర్కొన్నారు. ఫిబ్రవరి 28తేది జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కావలి కట్‌పీసెస్ కళ్యాణ మండపంలో జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి మనిషి క్రమం తప్పకుండా కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులు, పండ్లు కలిసిన సమతుల పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అప్పుడే మానవుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవితం గడుపుతారన్నారు. దేశ జనాభాలో సగం మంది పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనత, కంటి జబ్బుల వంటి వివిధ వ్యాధులతో బాధ పడుతున్నారని తెలిపారు. పౌష్టికాహారం పట్ల ముఖ్యంగా పిల్లలు, స్త్రీలలో అవగాహన కల్గించాల్సిన ఆవశ్యకతను చొక్కి చెప్పారు. ఆహారం



అల్లూరు మండలం గొల్లపాళెంలోని చైల్డ్‌కేర్ ఆశ్రమ నిర్వాహకుడు శరత్‌చంద్రకు సోటు పుస్తకాలందిస్తున్న నెల్లూరు మెయిన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోకా దయానంద్, డాక్టర్ యశోధర.

తీసుకొనే విషయంలో అపోహలను గూర్చి పలువురు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలతో నివృత్తి చేయడంతో ఈ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకున్నది. అంతకు ముందు పట్టణంలో పలు పాఠశాలల, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులతో డాక్టర్ బాబు చర్చాగోష్టులు నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమానికి జెవివి నాయకులు చంద్రమౌళి అధ్యక్షత వహించగా, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.జె.వర్మ సైన్సు దినోత్సవం విశిష్టతను వివరించారు. అనంతరం సైగర్ మహ్మద్ ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వర్లు, టివి శేషయ్య, బి.పెంచలనరసారెడ్డి, జి.మాల్యాద్రి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశ్వవినోదం వార్షికోత్సవం

కావలిలోని విశ్వవినోదం హాస్య సేవాసంస్థ వార్షికోత్సవం ఫిబ్రవరి 25తేది ఘనంగా జరిగింది. పిఎల్ నరసింహారావు జ్యోతి ప్రజ్వలన గావించగా, గండ్రకోట సుబ్రహ్మణ్యాశాస్త్రి నటరాజ పూజ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎస్వి శేషయ్య మాట్లాడుతూ నవ్వు పది మందికి పంచాలని, హాస్య స్ఫోరకంగా మాట్లాడి నవ్వించగలిగే కళాకారులు తయారు కావాలన్న తలంపుతో సంస్థను స్థాపించి నట్లుచెప్పారు. హాయిగా నవ్వితే ఆశాంతి, అలజడి, మానసిక రుగ్మతలు తగ్గుతాయన్నారు. వార్షికోత్సవం సందర్భంగా సుబ్రహ్మణ్య శాస్త్రి, రావణ, దుర్యోధన, భీమ పాత్రలు అభినయించగా, ఎస్వి శేషయ్య, నారాయణభట్, మహేష్, నాగ భూషణం హాస్యవల్లరితో అలరించారు. వార గణిత నిష్ణాతుడు షేక్.నజీర్ బాషా వార గణిత ప్రదర్శన గావించారు.

త్రీ ఫేజ్ అవినీతి

5వ పేజీ కొరవ

సన్మాన సభకు జిల్లా పరిషత్ ఛైర్మన్ పి.చెంచలబాబు యాదవ్ అధ్యక్షత వహించారు. రచయిత, కళాకారుడు, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఆదిశేషయ్య సేవలను ఎంపిపి బి.సురేంద్ర, జిల్లా బిజెపి అధ్యక్షులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, తిరుపతి మెడికల్ ఆఫీసర్ వేమారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ బొమ్మి సుమన్, స్థానిక నాయకులు కోడూరు పురంధర్‌రెడ్డి, ఎన్.శేషాద్రి వాసు, లాయర్ ఈదూరు భాస్కరయ్యలు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లితండ్రులు కొనియాడి సత్కరించారు.

చారిత్రక తృష్ణ తెనాలి రామకృష్ణ!

చరిత్రను నలుగురికీ చెప్పాలనే కోరిక, చరిత్రను మధించాలన్న ఉత్సాహం రచయితలో ఎక్కువగా కన్పిస్తున్నాయి. అయితే ఊహాగానాల సాహిత్యంలాగా సాహిత్య, చరిత్ర రచన అంత సులభం కాదు. ఊహాగానాల రచనలు ఎవరికీ అభ్యంతరం కావు. అయితే చరిత్ర రచనలో మాత్రం నిర్దిష్ట ప్రమాణాలుండాలి. లేకపోతే రచయిత నవ్వుల పాలవుతాడు.

రచయితలోని చరిత్ర తృష్ణ గొప్పదే - కాదనడం లేదు. అందుకు తగిన పరిశోధన కూడా కావాలి. ఒక ప్రముఖ దినపత్రికలో ఒకతను కాకతీయ ప్రతాపరుద్రుణ్ణి గురించి రాస్తూ అతను నెల్లూరు జిల్లా పాటూరులోని తిక్కనను కలిసి మంతనాలాడాడని రాశాడు. ఇదెంతటి అబద్ధమో చరిత్రకారులందరికీ తెలుసు. ఇట్లా రాసి అతను తనను తాను నవ్వుల పాలు చేసుకోవడమే గాక పత్రిక ప్రతిష్టను కూడా పరోక్షంగా దెబ్బతీశాడు. ఇలాంటి రచనలను ఎవరైనా ప్రోత్సహించకూడదు.

తెనాలి రామకృష్ణ పుస్తకంలోని తీవ్రమైన పొరబాట్లను అటు రచయితకూ, ఇటు పాఠకులకూ తెలియజెప్పాలనే వుద్దేశంతో ఈ పుస్తకాన్ని సమీక్షకు తీసుకున్నాను.

చరిత్ర ప్రకారం శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోనూ, అతని తండ్రి నరసానాయకుని ఆస్థానంలోనూ అష్టదిగ్గజాలున్నారు. అష్టదిగ్గజాలను పోషించడం తుళువ వంశంలో వచ్చిన ఆనవాయితీ. అయితే సాహితీ ప్రియత్వం కృష్ణదేవరాయల కాలంలో అత్యున్నత శిఖర స్థాయికి చేరుకోవడం వల్ల అష్టదిగ్గజ ప్రచారం విస్తృతంగా కొనసాగింది.

రచయిత భావించినట్లు-

కృష్ణదేవరాయల ఆస్థానంలో తెనాలి రామకృష్ణ కవి లేడు. ఎంచేతనంటే -

కృష్ణదేవరాయలు క్రీ.శ 1527లో కడప జిల్లా 'తిప్పలూరు'ను అష్టదిగ్గజాలకు అగ్రహారంగా ఇచ్చాడు. కర్ణాటక రాష్ట్రంలో కోలారు జిల్లా 'నందిదుర్గం' గ్రామ శాసనంలో కూడా అష్టదిగ్గజాల ప్రస్తావన వుంది. ఈ విషయమై అనేక శాసన ప్రస్తావనలున్నాయి. వీటిలోనూ అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, మాదయగారి మల్లనలు తప్ప ఇతర కవుల ప్రస్తావనలు లేవు.

సాహిత్య గ్రంథాలలో సైతం వీరి ముగ్గురి పేర్లే లభ్యమవుతున్నాయి.

రచయిత భావించినట్లు అష్టదిగ్గజ కవులందరూ కూడా తెలుగు కవులు కాదు.

క్రీ.శ 1512లో మూడింద్ల తురకలపై యుద్ధాన్ని ముగించుకొని విజయదుందుభి మ్రోగించి కృష్ణదేవరాయలు హంపికి చేరుకున్నప్పుడు పై ముగ్గురు కవులు మాత్రమే రాయల్ని పద్యాలతో పొగిడారు.

అష్టదిగ్గజ కవులు తమ పాండితీ ప్రకర్షను ప్రదర్శించిన 'భువన విజయాన్ని' రాయలు క్రీ.శ 1513-15 ప్రాంతాలలో పునరుద్ధరించాడు.

ముక్కు (నంది) తిమ్మన, పారిజాతాపహరణం కూడా క్రీ.శ 1515 ప్రాంతాలకు పూర్తి అయింది. ఈ నేపథ్యంలో అల్లసాని, ముక్కు తిమ్మన, మాదయగారి మల్లన మాత్రమే తెలుగు కవులు. మిగతా వారు వివిధ భాషల పండితులు.

కన్నడ కవి తిమ్మనాచార్యులు, సంగీత సూర్యోదయ సంస్కృత కవి లక్ష్మీనారాయణకవి, సంస్కృతకవి భానుకవి, ఈశ్వర దీక్షితులు అష్టదిగ్గజాలలో వున్నారు. ధూర్జటి రాయల ఆస్థానంలో కొంత కాలం మాత్రమే వున్నాడు. ఆ తర్వాత క్రీ.శ 1513-18 ప్రాంతాలలో జన్మ స్థలమైన శ్రీకాళహస్తికి వెళ్లి అక్కడ శ్రీకాళహస్తీశ్వర మహత్యాన్ని రచించాడు.

అయ్యలరాజు రామభద్రుడు రాయల ఆస్థానంలో వున్నది కొంత కాలమే. ఎందుకంటే రామభద్రుడు కడప జిల్లా 'ఒంటిమిట్ట' నివాసి. అక్కడికి వెళ్లి చివరి రోజులు రామునిసేవలో తరించాడు.

(కొరవ వచ్చేవారం)

పుస్తక సమీక్ష

తెనాలి రామకృష్ణ
రచయిత
వేరంశెట్టి సుబ్బారావు
సమీక్షకులు
పాయసం సుబ్రహ్మణ్య మహర్షి
ప్రతులకు: పి.శాంతి,
'ఉష' ప్రచురణలు, సనత్‌నగర్,
హైదరాబాద్.
వెల : 45/-

సినిమా

వగలతో సెగలు పుట్టిస్తా

బాలీవుడ్ హీరోయిన్, బెంగాలీ భామ బిపాసబసు తనకు చల్లబడటం లేదా చల్లబరచడం కన్నా, వేడెక్కడం, వేడి ఎక్కించడమే ఇష్టమంటుంది. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమెను మీ చిలిపిచూపులు, ఓర చూపులు, సెగలు కాస్త మారినట్లుందేనన్నాను. దీనికి సమాధానంగా ఎప్పుడూ

బిపాషా సెక్స్ నిషా

ఒళ్లూ, కళ్లూ ఒక్కలాగే వుండిపోతే అందం ఏం వుంది? ఆడదాని శరీరంలోనూ, నడకలోనూ, చూపులోనూ తరచూ మార్పులొస్తుంటే కదా; మగవాళ్లంతా ఎగబడి చూస్తారంది. సెక్స్‌కి, సెక్సీగా వుండడానికి చాలా తేడా వుందని వివరించింది. 'సెక్స్ అంటే ఆడ లేక మగ అని అర్థం. అంటే లింగ భేదం

కొరవ 11వ పేజీలో

వీళ్లు రోత హీరోయిన్లు

తెలుగు చిత్రాల్లో కథానాయికల స్థాయి తగ్గిపోతుంద నాలి. మొదటి తరం సినిమాలను పరిశీలిస్తే అవి ఏ భాషా చిత్రాలైనప్పటికీ కథానాయిక, కథా నాయకుడికి సరిజోడుగా నటించేది. భానుమతి, అంజలీదేవి, సావిత్రి, షావుకారు జానకి; కృష్ణకుమారి, వాణిశ్రీ, శారద, విజయనిర్మల, జయసుధ, జయప్రద, శ్రీదేవి, విజయశాంతిలు హీరోలతో సమానంగా

నాటికి నేటికి తేడా

ఒక వెలుగు వెలిగారు. ముంబాయి నుంచి హీరోయిన్ల దిగుమతి ఎప్పుడైతే మొదలైందో అప్పటి నుంచీ తెలుగు చిత్రాల్లో కథానాయిక స్థానం కోల్పోయిందనాలి. భాష తెలియని వాళ్లనీ, నటనలో ఓనమాలు నేర్వని వాళ్లని సరాసరి ఫ్లయిట్‌లో దింపేసి, హీరోయిన్లు చేసేయడంతో కథానాయిక స్వరూపం' మారిపోయింది. కేవలం తమ అందాలను వెండి తెరమీద ఒలక బోయడానికే వాళ్లకు లక్షలకు లక్షలు వెచ్చిస్తున్నారు. గ్లామర్, వ్యాపారమయం అయిపోయిన నేటి సినిమాలో కథ నాయిక పాత్ర విలువలతోను, వలువలతోను కూడి వుండాలని ఆశించడం ఇక దండగేననాలి.



'అరె...!'లో కేశవతీర్థ, మౌనిక

నా వల్లు నా ఇష్టం

పాక్ నటి మీరా

నటనకు నిరసనలా అనే సందేహం కల్గవచ్చు. పాకిస్తాన్ నటి మీరా, భారతీయ చిత్రం 'నజర్‌కే సామ్నే'లో నటిస్తున్నందుకు రకరకాల బెదరింపులొస్తున్నాయి. మీరా పాకిస్తాన్‌లో గ్లామర్ నటి. కాని భారతీయ చిత్రంలో ఆమె హద్దులు మీరుతోందని పాక్ సనాతన వాదుల బాధ. పాకిస్తాన్‌లో 60 చిత్రాల్లో నటించిన మీరాను కారా ఫిలిం ఫెస్టివల్‌కు హాజరైన దర్శకుడు మహేష్ భట్ చూసి బాలీవుడ్‌లో ఛాన్స్ ఇచ్చాడు. మీరా మాత్రం పాక్ నుంచి వస్తున్న ఫోన్ కాల్స్‌కు భయపడడం లేదు. నా శరీరం నా ఇష్టం. నేను అసభ్య, అనైతిక చర్యలు చేయనంత వరకు ఎవరికీ నన్ను ప్రశ్నించే అధికారం లేదంటుంది. హిందీ చిత్రంలో ఆమె బోల్డ్‌గా నటిస్తున్నట్లు గుసగుసలు విన్పిస్తున్నాయి. మీరా తన సహనటుడు అస్మిత్ పటేల్‌తో కలిసి ముద్దు సన్నివేశంలో కూడా నటించినట్లు వార్తలు వెలువడుతున్నాయి. పాకిస్తాన్‌లోని ముస్లిం వర్గాలు ఈ విషయం తెలుసుకుని ఫత్వా ప్రకటించి, ఆమె తిరిగి స్వదేశంలో కాలు పెడితే ఊరుకోమంటున్నాయి. మీరా మాత్రం భారతీయ సంస్కృతే గొప్పదంటుంది. బాలీవుడ్‌లో మహిమాచౌదరి, బిపాసబసు, భూమిక తనకు ఇష్టమైన నటీమణులంటుంది. నజర్ కీ సామ్నే విడుదలైతే గాని మీరా పాకిస్తాన్‌లో ఎదుర్కొనే పరిస్థితులేమిటో అర్థం కావు.

నాగార్జున తల్లి పాత్రలో నదియా

వింత దొంగలు, బజారు రౌడీ చిత్రాల్లో హీరోయిన్ నదియా పెళ్లి తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పింది. ఇటీవల తమిళ చిత్రాల్లో నటించను ఆరంభించిన ఈ గ్లామర్ నటి తెలుగులో టాప్ హీరో నాగార్జున తల్లిగా నటించను గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి గాను

కొరవ 11వ పేజీలో

అందాలకు సీలింగ్ ఎందుకు

తెలుగమ్మాయి బాలీవుడ్‌లో 'మైనే దిల్ తుఝ్‌కో దియా, దర్నా మనా హై' చిత్రాల్లో నటించి కుర్రకారును కిర్రెక్కించిన సమీరారెడ్డి వళ్లు చూపను పరిమితులెందుకంటుంది. నిర్మాత వచ్చి కథ చెప్పగానే అందులో నా పాత్ర ఏమిటో తెలుసుకొంటాను. ఎక్స్‌పోజింగ్ మోతాదును పట్టించుకోను. అలా

సమీరా సందేహం

పరిమితులు పెట్టుకొంటే ఈ పోటీ ప్రపంచంలో వెనుకబడిపోతానంటుంది. ప్రస్తుతం అమెరికా - అమెరికా నవల ఆధారంగా రూపొందుతున్న కాల్ పురుష్ చిత్రంలో డిఫరెంట్ రోల్ చేస్తున్నానని చెబుతున్న సమీరా, దర్శకుడు సంజయ్ సూరితో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతుంది. ఈ సంగతేమిటంటే మేమిద్దరం కేవలం స్నేహితులమేనని బుకాయిస్తుంది.

ఉండీలేని డ్రస్‌లే ఇష్టం

ఐటమ్ సాంగ్స్‌తో బాలీవుడ్‌లో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొన్న రాఖీ సావంత్, విలక్షణ నటుడు కమల్‌హాసన్ సరసన ఓ ఐటమ్ సాంగ్ చేసింది. రాజ్‌కమల్ మూవీస్ పతాకంపై హిందీ, తమిళ భాషల్లో కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'ముంబై ఎక్స్‌ప్రెస్'లో ఈ పాట చేసిందామె. ఈ పాటలోతాను కురచ దుస్తుల్లో సెక్సీగాకన్పిస్తాననీ, చక్కని డ్యాన్సర్ అయిన

రాఖీ బరితెగింపు

కమల్‌తో కలిసి ఇటువంటి పాటలో నర్తించడం తనకు చాలా ఆనందాన్నిచ్చిందనీ రాఖీ చెబుతుంది. ఈ పాటలో వుండీ లేనట్లుగా వుండే దుస్తుల్ని ధరించిన రాఖీ, కమల్‌తో ఎలా కన్పిస్తుందో చూడాలని రసిక జనం ఎదురు చూస్తున్నారు.

మళ్లీ గుణశేఖర్ దర్శకత్వంలో ఎన్టీఆర్

గుణశేఖర్ దర్శకత్వంలో ఎన్టీఆర్ బాలనటుడిగా 'బాలరామాయణం'లో నటించిన విషయం పాఠకులకు విదితమే. ఎన్టీఆర్ హీరోగా మారాక విరిద్దరి కాంబినేషన్‌లో చిత్రం

కొరవ 11వ పేజీలో

లయ హొయలు

తెలుగు సినిమాల్లో సౌందర్య తర్వాత టాప్ హీరోయిన్‌గా ఎదగగల లక్షణాలు లయలో వున్నాయని సినీ విశ్లేషకులు అంచనాలు వేశారు. లయ కూడా టాప్ హీరోల సరసన ఒక్కటంటే ఒక్క అవకాశం వస్తేచాలని తన సత్తా చూపుతానంటుండేది. విజయేంద్రవర్మలో బాలకృష్ణ భార్యగా నటించే అవకాశం రావడంతో పొంగి పోయిందామె. ఆ ఆనందంలో గత సినిమాలలో పోల్చుకుంటే కాస్తంత బోల్డ్‌గా పాటల్లో కన్పిం

వేషాలకు పాట్లు

చింది. ఆ సినిమా రానూ వచ్చింది, పోనూ పోయింది. అయినా లయను పట్టించుకున్న వాళ్లు లేకపోయారు. ఈ మధ్యలో మళయాళంలో మమ్ముట్టి సరసన నటించే అవకాశం పొందింది. ఆ సినిమా తర్వాత శివాజీ సరసన నటించమని తెలుగు పరిశ్రమ నుంది మళ్లీ పిలుపొచ్చింది. నా కెరీర్ గతి ఇంతే అంటూ సరిపెట్టుకొని ఓకే అంది. పిన్నమ్మ కాంబినేషన్ కావడం వల్ల ఈ సినిమా ఒప్పుకొన్నానంటుంది. వచ్చే వారంలో ఈ సినిమా మొదలవుతుంది.

సంక్రాంతి చిత్రం శోభాయమానం

తమిళ చిత్రం "ఆనందం" ఆధారంగా తెలుగులో సంక్రాంతి చిత్రం రూపొందింది. ముప్పలనేని శివ ఈ చిత్రా నికి స్క్రీన్‌ప్లే వ్రాసి దర్శకత్వం వహిం చాడు. సాంప్రదాయ ఉమ్మడి కుటుం బానికి సంబంధించిన కథ ఇది. రాఘవ, విష్ణు, శివ, శర్వానంద్ అన్నదమ్ములు. వీరి కుటుంబం మీద ఈ కథ నడు స్తుంది. రామాయణంలోని రామ,లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు ఆదర్శంగా వ్యవహరి స్తారు ఈ అన్నదమ్ములు.

రాఘవ (వెంకటేష్) రాముడు లాంటివాడు కాబట్టి పొందికగా, హుందాగా వ్యవహరిస్తాడు. ఇతనే చిత్రానికి కథా నాయకుడు. పెద్దగా చదువుకున్న వాడు కాదు. లోకజ్ఞానం బాగా వున్న వాడు. బరువు, బాధ్యతలు తెలిసిన మనిషి. తమ్ముళ్ల పట్ల విపరీతమైన ప్రేమానురాగాలుంటాయి. మంచిని ఎందుకొని, పదిమందికీ మంచిని పంచాలన్నది అతని ధ్యేయం. చెడ్డవాడినైనా మంచి మాటలతో సన్మార్గుడిగా మార్చవచ్చన్నది అతని నమ్మకం. రాఘవకు లక్ష్మణుడు లాంటి తమ్ముడు విష్ణు (శ్రీకాంత్), లక్ష్మణుడు లాగానే అన్న మాట జవదాటడు. అన్న అడుగు జాడలు అనుసరిస్తుంటాడు. లక్ష్మణుడికి లాగానే విష్ణుకు చిరుకోపం వుంటుంది. అన్నను ఎవరైనా అవమానిస్తే వారిని కోపంతో ఎదిరిస్తాడు. అది అన్న రాఘవకు ఇష్టం లేదు. అలా ఎదుటి వారిపై ప్రవర్తించ వద్దని విష్ణును వారిస్తాడు.

చిత్ర సమీక్ష

గ్రిద్దలూరు గోపాలరావు

చిత్రం కథంతా రాఘవ, విష్ణు పాత్రలను ఆధారం చేసుకొని నడుస్తుంది.

రాఘవకు ఒక ప్రేమకథ వుంది. అతను ఒక పెళ్లికి పోతాడు. అక్కడ పద్మ (ఆర్తి అగర్వాల్) అనే అల్లరి పిల్ల, రాఘవను పెళ్లికొడుకుగా భావించి అతన్ని ఆట పట్టిస్తుంది. ఇద్దరి మధ్య అక్కడ ప్రేమ అంకురిస్తుంది. ఇతరుల పెళ్లి సమయాల్లో హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ అంకురించడం ఇది వరకు ఎన్నో చిత్రాల్లో చూపబడింది. ఆ పాత పచ్చడే ఈ చిత్రంలోనూ వడ్డించబడింది. ప్రేమ అంకురించిన తర్వాత ఇక మిగిలింది ఆటాపాటే కదా. "అందాల శ్రీమతికి చెప్పలేని అలకంటా మనసారా లాలిస్తే చంటిపాప తానంటా"- అంటూ రాఘవ చెట్టాపట్టాలేసుకుంటా ఆమె వెంట తిరుగుతాడు.

ఉన్నట్టుండి రాఘవ కుటుంబానికి ఊహించని కష్టం వచ్చి పడుతుంది. ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల తొలగింపు సందర్భంగా రాఘవ ఇల్లు, కొట్లు, ప్రభుత్వం పడగొట్టిస్తుంది. కుటుంబం మొత్తం వీధి పాలవుతుంది. రాఘవ పతనాన్ని చూసి పద్మ తండ్రి (రఘునాధ రెడ్డి) తన కూతుర్ని రాఘవకు ఇవ్వనని

కొరవ 11వ పేజీలో

కళ్లలో పెళ్లి పందిరి

'అబ్ తుమ్హారే హవాలే వతన్ సాతియో' చిత్రం ద్వారా నటిగా మంచి గుర్తింపు తెచ్చుకొన్న మోడల్ దివ్య కోస్లా, టి -సిరీస్ అధినేత తనయుడు భూషణ్ కుమార్‌ను పెళ్లి చేసుకోబోతున్నందన్న వార్త బాలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. అయితే ఇప్పటికే సోఫియా, రాఖీ సావంత్‌లతో ప్రేమాయణం నడిపిన భూషణ్ ఇప్పుడు దివ్యతో సాగిస్తున్న ఎఫైర్‌పై భిన్న స్వరాలు విన్పిస్తున్నాయి. ఇదే విషయాన్ని దివ్యను అడిగితే వాటిని

దివ్య కోస్లా

గూర్చి పట్టించుకొంటే మా పెళ్లి జరిగినట్టేనంటుంది. మా ఇద్దరికీ ఒకరిని గూర్చి మరొకరికి బాగా తెలుసు. ఎట్టి పరిస్థితుల్లోనూ మా పెళ్లి జరిగి తీరుతుంది. పరిశ్రమలో రకరకాలుగా మాట్లా

కొరవ 11వ పేజీలో

CAR ZONE
మీ కార్లకు A to Z ఎక్సూటా ఫిట్టింగ్స్‌తో పాటు Sun Control Film మరియు ఆడియో సిస్టమ్స్ & సెంట్రల్ లాకింగ్, Power Windows, Company Seat Covers సరసమైన ధరలో అమిందును
Current Office Centre, Opp: Andhra Bank, Dargamitta, Nellore. Ph: 5529991, Cell: 94406 91303

వారఫలాలు

తేది 5-3-2005 నుంచి 11-3-2005 వరకు మేషంలో రాహువు; తులలో కేతువు; కన్యలో వక్ర గురువు; మిథునంలో వక్ర శని; ధనుస్సులో కుజుడు; కుంభంలో రవి, శుక్రుడు; మీనంలో బుధుడు; ధనుస్సు, మకర, కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తాడు.

మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1పాదం)

ఆర్థిక విషయాలలో పురోభివృద్ధి వైపు అడుగు వేస్తారు. కుటుంబ సమస్యలు తీవ్రతరమయ్యే అవకాశాలున్నందున జాగ్రత్త వహించాలి. వ్యాపార, క్రీడా, విద్యా, వ్యవసాయ రంగాలలోని వారికి పురోభివృద్ధి వుంటుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరంగా ధన వ్యయం వుంటుంది. ప్రభుత్వ పరంగా జరగాల్సిన విషయాలలో ఫలితాలుంటాయి. ఎలక్ట్రికల్, పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాలలోని వారికి ఆశించిన ఫలితాలుంటాయి. గృహ నిర్మాణ, వాహన కొనుగోళ్లు తదితర విషయాలలో ఆచితూచి వ్యవహరించాలి.

వృషభం

(కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

ఉన్నత స్థాయి వ్యక్తుల సహాయ సహకారాలతో పాటు మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక ప్రణాళికలలో ఆచితూచి వ్యవహరించాలి. ఉపాధి రంగాన్వేషణలోని వారు ప్రతి అవకాశాన్ని సద్వినియోగ దిశలో ఆలోచించడం అవసరం. విద్య, వ్యాపార, సాంకేతిక, ఇంజనీరింగ్ రంగాలలోని వారికి మిశ్రమ ఫలితాలుంటాయి. భాగస్వామిక ఒప్పందాలు, చర్చలు ఆశించిన స్థాయిలో వుండవు. ఇతరుల విషయాలకు దూరంగా మెలగాలి. అనవసర వ్యయం పట్ల జాగ్రత్త వహించాలి.

మిథునం

(మృగశిర 3,4పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

మీ ప్రవర్తన వల్ల శ్రేయోభిలాషులు దూరమవుతారు. ఆర్థిక ప్రణాళికలలో పూర్వపు స్థితి కొనసాగుతుంది. ముఖ్యంగా ఆరోగ్య విషయంగా ఆందోళన తప్పదు. నూతన భవిష్యత్ ప్రణాళికలు వాయిదా వేసుకోవడం మంచిది. స్థిర చరాస్తుల విషయాలు కొలిక్కి రావు. గృహ నిర్మాణ, వ్యాపార రంగాలలోని వారికి రుణ వత్తిళ్లు వుంటాయి. ఇతరులు మీ విషయాలలో కల్పించుకొనే అవకాశాలుంటాయి. విద్యా రంగంలోని వారికి అధిక శ్రమ తప్పదు. వాహన చోదకులకు జాగ్రత్త అవసరం.

కర్కాటకం

(పునర్వసు 4పాదం, పుష్య, ఆశ్లేషలు)

ఆర్థిక వ్యవహారాలలో ఇతరుల జోక్యం వల్ల నష్టపోయే అవకాశాలుంటాయి. జాప్యమైన స్థిరాస్తుల విషయాలు కొంత వరకు సానుకూల పడతాయి. వృత్తి, వ్యాపార రంగాలలోని వారికి ఒడిదుడుకులుంటాయి. వాహన, గృహ నిర్మాణ రంగాలలోని వారికి సమస్యల పట్ల ఆందోళన వుంటుంది. కాంట్రాక్టు, పారిశ్రామిక రంగాలలోని వారికి రావాల్సిన బకాయిలు, జరగాల్సిన పనులలో ఆందోళన వుంటుంది. ఉపాధి రంగాన్వేషణలోని వారికి అనవసర వ్యయం వుంటుంది. సాంకేతిక, ఇంజనీరింగ్ రంగాలలోని వారికి పురోభివృద్ధి వుంటుంది.

సింహం

(మఖ, పుబ్బ, ఉత్తర 1వపాదం)

జాప్యమైన ప్రణాళికలలో ఉన్నత స్థాయి, శ్రేయోభిలాషుల సలహాలు అవసరం. మీ ప్రణాళికా అమలులో గుర్తింపు పొందుతారు. విద్య, వ్యాపార, ఉపాధి రంగాన్వేషణలోని వారికి ఆశించిన ఫలితాలున్నా ఇతరులు తప్పుదోవ పట్టించే అవకాశాలున్నాయి. పిల్లల భవిష్యత్ ప్రణాళికలలో ఆందోళనలుంటాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం గూర్చి ధన వ్యయం వుంటుంది. ఇతరుల ఆర్థిక విషయాలలో అకారణ కలహాలుండడం వల్ల జాగ్రత్త అవసరం.

కన్య

(ఉత్తర 2,3,4పాదాలు, హస్త, చిత్త 1,2పాదాలు)

జాప్యమైన ప్రణాళికలలో ఓర్పు, పట్టుదలతో కార్యోన్ముఖులుగా మెలగడం అవసరం. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక ప్రణాళికలలో సమతౌల్యం పాటింపలేరు. అధిక త్రిప్పట, ఆరోగ్య భంగం వల్ల ఆందోళన వుంటుంది. ఉన్నతస్థాయి వ్యక్తుల సహాయంలో ఆటంకాలున్నా సానుకూల పడతాయి. విద్య, వ్యాపార, ఇంజనీరింగ్ రంగాలలోని వారికి, స్థిరాస్తుల విషయాలలో కొంత వరకు సానుకూల ఫలితాలుంటాయి. సాహిత్య, కళా రంగాలలోని వారికి మిశ్రమ ఫలితాలుంటాయి.

పంచాంగం

నేలనూతల శ్రీనివాస మూర్తి

మార్చి తిథులు
మాఘ బహుళ

5 శని దశమి రా2.38గం.ల వరకు
6 ఆది ఏకాదశి రా12.14గం.ల వరకు
7 సోమ ద్వాదశి రా9.49గం.ల వరకు
8 మంగళ త్రయోదశి రా7.31గం.ల వరకు
9 బుధ చతుర్దశి సా5.28గం.ల వరకు
10 గురు అమావాస్య ప3.12గం.ల వరకు

ఫాల్గుణ శుద్ధ
11 శుక్ర పాడ్యమి ప1.48గం.ల వరకు

తుల

(చిత్త 3,4పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3పాదాలు)

ప్రణాళికల పట్ల సానుకూల ఫలితాలు సకాలంలో పొందగల అవకాశాలున్నాయి. నిర్ణయాలను గోప్యంగా అమలు పరచాలి. ఇతరుల విషయాలకు దూరంగా మెలగాలి. ఉన్నత విద్యావకాశాలు, ఉపాధి రంగాన్వేషణ విషయాలలో సానుకూల ఫలితాలుంటాయి. వ్యాపార, గృహ నిర్మాణ పనులలో ఒత్తిళ్లున్నా ముందడుగు వేస్తారు. వాహన కొనుగోళ్లలో మిశ్రమ ఫలితాలుంటాయి. దూర ప్రయాణాలు లాభింపవు. సాహిత్య, లలిత కళా రంగాలలోని వారికి పూర్వపు స్థితి కంటే మెరుగ్గా వుంటుంది.

వృశ్చికం

(విశాఖ4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఊహించని పరిస్థితులలో ప్రణాళికా బద్ధంగా వ్యవహరింపలేరు. ఆర్థికంగా సమతౌల్యం, వున్న దానిలోనే వ్యయం చేయాలి. రుణవత్తిళ్లు, కుటుంబ సమస్యలు, ఉన్నత స్థాయి వ్యక్తులతో మనస్పర్థలలో పట్టుదల వదలి సర్దుబాటు దిశగా ఆలోచనలు అవసరం. ఆరోగ్య విషయంగా ధన వ్యయం వుంటుంది. స్థిరాస్తులు, కోర్టు వ్యవహారాలు, కాంట్రాక్టు రంగంలోని వారికి ఒడిదుడుకులున్నా సానుకూల పరిస్థితులు అందుబాటులోకి వస్తాయి. వాహన చోదకులకు జాగ్రత్త అవసరం.

ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

ముఖ్యమైన ప్రణాళికలలో స్వతంత్రంగా వ్యవహరించడం అవసరం. ఆర్థికంగా సమతౌల్యం పాటింప లేరు. ఆధ్యాత్మిక రంగంలోను, ఉన్నతస్థాయి వ్యక్తుల సాంగత్యం వల్ల కొన్ని సమస్యల నుంచి విముక్తి పొందడమేగాక, గుర్తింపు పొందుతారు. ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. రుణవత్తిళ్లు వున్నా సమయానుకూలత వుంటుంది. ఇంజనీరింగ్, సాంకేతిక, విద్య, వ్యాపార రంగాలలోని వారికి ఆర్థిక ప్రణాళికలు అనుకున్న విధంగా సాగవు. కుటుంబ సభ్యుల ఏకాభిప్రాయ సాధన పొందలేరు.

మకరం

(ఉత్తరాషాఢ, 2,3,4పాదాలు, శ్రవణం, ధనిష్ఠ1,2పాదాలు)

దీర్ఘకాలంగా జాప్యమైన ప్రణాళికలలో సానుకూల అవకాశాల పట్ల సఫలీకృతులౌతారు. వాగ్వివాదాలకు దూరంగా మెలగాలి. విద్య, వ్యాపార రంగాలలోని వారికి ఒడిదుడుకులున్నా అవకాశాలతో పాటు గుర్తింపులభిస్తుంది. ఆర్థిక ప్రణాళికలలో ఆదాయ శాతం కన్నా వ్యయం ఎక్కువగా వుంటుంది. ఇతరుల విషయాలకు, పెద్దపత్తిత్వాలకు, దూరంగా మెలగాలి. గృహ మార్పులు, చేర్పులు, వాహన విషయాలలో, రుణ పత్తిళ్లతో పాటు సానుకూల అవకాశాల పట్ల ఓర్పుతో వుండాలి.

కుంభం

(ధనిష్ఠ 3,4పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

రావల్సిన ధనం పట్ల ఆందోళన వుంటుంది. ఆర్థిక సమతౌల్యం పాడింప లేని పరిస్థితుల పట్ల ఆందోళన వుంటుంది. ఉన్నత స్థాయి వ్యక్తుల సలహాల వల్ల కొన్ని సమస్యలు తీరుతాయి. నూతన పరిచయాలు సకాలంలో లాభింపవు. ఉపాధి, విద్య, సాంకేతిక రంగాలలోని వారికి ఆశించిన సత్ఫలితాలుంటాయి. కోర్టు వ్యవహారాలు, గృహ నిర్మాణ పనులు, పారిశ్రామిక విధులు తదితర విషయాలలో ఒడిదుడుకులుంటాయి. పిల్లల భవిష్యత్ ప్రణాళికలు వాయిదా వేసుకోవడం అవసరం.

మీనం

(పూర్వాభాద్ర 4పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ముఖ్యమైన ప్రణాళికలలో ఓర్పు, పట్టుదల కొనసాగిస్తే సఫలీకృతులౌతారు. వ్యతిరేక పరిస్థితులలో సానుకూల అవకాశాలున్నందు వల్ల గోప్యంగా నిర్ణయాలు అమలు పరచాలి. ఉపాధి రంగాన్వేషణలోని వారికి ఊహించని సత్ఫలితాలుంటాయి. ఆర్థిక ప్రణాళికలలో, ఇతరులకు ఆర్థికంగా సహాయ విషయాలలో చిక్కుల పట్ల ఆందోళన తప్పదు. కుటుంబ సభ్యుల సలహాలు పాటిస్తే కొన్ని సమస్యలు సమసిపోతాయి. కోర్టు వ్యవహారాలు, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవడం అవసరం.

జనవాణి

3వ పేజీ కొరవ

ఆరోగ్య వంతులకు మందులివ్వకూడదు

ఎంతో కాలంగా సమాజంలో పురుషాధిక్యతా వైఖరి నాటుక పోవడంతో ఒక మూఢ నమ్మకం రూపుదిద్దుకుంది. భర్త, భార్యను అదుపులో పెట్టుకొంటేనే సమాజం గౌరవిస్తుందనుకొంటారు. భార్యను అదుపులో పెట్టుకోవడానికి పురుషుడు సమర్థవంతంగా శృంగారకలాపాలను నిర్వహించాలని భావించడం కూడా సహజమే. కాబట్టి శృంగార కలాపాలలో వైఫల్యాన్ని పురుషుడు అవమానంగా భావించడం సర్వసాధారణం. ఈ పరిస్థితికి తోడుగా శృంగార కలాపాలను గూర్చి అవగాహన లోపించడంతో కొందరు ఆరోగ్యవంతులు కూడా శృంగార సమస్యలకు లోనవుతారు. సెక్స్ అండ్ మెరైటల్ కౌన్సెలింగ్ ద్వారా భార్యా భర్తలకు శృంగారాంశాలలో అవగాహనను పెంపొందించి సమాన భావంతో సన్నిహిత మిత్రులుగా మెలిగేట్లు చేయగలగాలి. అప్పుడప్పుడూ ఆరోగ్యవంతులలో కూడా ఆకలి ఎలా మందగిస్తుందో అదే విధంగా శృంగార కలాపాలలో వైఫల్యం ఎదురు కావచ్చనే వాస్తవాన్ని భార్యా భర్తలిద్దరూ గ్రహిస్తారు. కానీ ఇటువంటి సమస్యలకు కూడా మందులున్నాయంటూ ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం జరుగుతూంది. సాంఘిక సాంస్కృతిక ధోరణుల మూలంగా సమస్యకు గురైన ఆరోగ్య వంతులకు మందులివ్వడంలో అర్థం లేదు. కొందరిలో ఇటువంటి మందులు ప్రమాదకరం.

నెల్లూరు డాక్టర్ ఐ.రాజగోపాలరెడ్డి

నెల్లూరును నిరాశ పర్చిన లాలు రైలు

కేంద్ర రైల్వేమంత్రి లాలు ప్రసాద్ యాదవ్ ప్రవేశ పెట్టిన రైల్వే బడ్జెట్‌లో నెల్లూరు జిల్లాకు రిక్తహస్తం చూపారు. కృష్ణపట్నం - కడప, వెంకటగిరి - సడికుడి రైల్వే లైన్ల సర్వే ఎప్పుడో పూర్తయినా ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరగలేదు. సికింద్రాబాద్ - గూడూరు సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు రావడమే గొప్ప ఘనతగా భావిస్తున్నారు. అయ్యప్పగుడి, వెంకటేశ్వరపురంల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలకు, జిల్లాలో ఇతర స్టేషన్ల నవీకరణకు నిధులు కేటాయించలేదు. చెన్నై నుంచి అదనపు మెము రైలు మంజూరుకాలేదు. కేంద్ర ఆరోగ్య మంత్రి, 8 మంది ఎమ్పీలు నెల్లూరు జిల్లా నుంచి లోక్‌సభ, రాజ్యసభలలో ప్రాతినిధ్యం వహిస్తూ, లాలూపై ఒత్తిడి చేసి సాధించింది శూన్యం. గతంలో వెంకయ్య నాయుడు ఒక్కడైనా మెము రైళ్లు, పలు స్టేషన్ల అభివృద్ధికి నిధులు తెచ్చిపెట్టారు.

నెల్లూరు వాస్తు రామచంద్ర

ఆర్‌బిఎఫ్ బాధితులను ఆదుకోండి

మద్రాసు ఆర్‌బిఎఫ్ కంపెనీ మూతపడి ఐదేళ్లయ్యింది. కొన్ని వందల మంది డిపాజిటర్లు కొన్ని వందల కోట్ల రూపాయలు పోగొట్టుకొని మతి చలించి నామరూపాలు లేకుండా సర్వ నాశనమై పోయారు. మాగుంట కుటుంబీకులను చూసే నెల్లూరీయులు ఆర్‌బిఎఫ్‌లో డబ్బులు డిపాజిట్ చేశారు. మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆర్థికంగా మళ్లీ పుంజుకొని వున్నారు. ఇప్పుడైనా నిర్భాగ్యులైన డిపాజిటర్లను ఆదుకోవాలి.

నెల్లూరు ఎం.శివప్ప

నెల్లూరు హోదా పెరిగింది

నెల్లూరు మునిసిపాలిటీ, కార్పొరేషన్ అవడం వల్ల కార్పొరేటర్లు, మేయర్ల ఆదాయాలు పెరుగుతాయి తప్ప నగర జనులకు ఒరిగేది ఏమిటని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. కాని ఇది పొరపాటు. నగర జనుల హోదా పెరిగింది. ఎట్లా అంటారా? మునిసిపాలిటీగా వున్నప్పుడు ఇళ్ల పన్ను రసీదులు, నోటీసులు తెలుగులో ఇచ్చేవారు. కార్పొరేషన్ అయ్యాక ఇంగ్లీషులోనే వస్తున్నాయి. మహానగరమైన బెంగుళూరులో ఈ నోటీసులు కన్నడం, ఇంగ్లీషులలో వస్తాయి. నెల్లూరులో మాత్రం ఇంగ్లీషులోనే ఇస్తున్నారు. కార్పొరేషన్ అయినా మంచినీటి సరఫరా, పారిశుధ్య పనుల్లో మెరుగుదల లేదు. అపార్టుమెంట్లు ఇష్టమొచ్చినట్లు కడుతున్నారు. పైవన్నీ మెరుగు పర్చడం శ్రమతో కూడిన పనులు. తెలుగుకు బదులు ఇంగ్లీషులో నోటీసులు సులభం. దీన్ని తెలుగు భాషోద్యమానికి చిరు కానుకగా భావిద్దాం.

నెల్లూరు టి.కె.రెడ్డి

50 ఏళ్ల క్రితం

3వ పేజీ కొరవ

పుచ్చలపల్లి సుందరయ్య గారు 821 ఓట్ల మెజార్టితో గెలుపొందారు.

మధ్య తరగతి వారిపై కొత్త పన్నులు

ఇండియా ప్రభుత్వం 1955-56 ఏడాది ఆదాయ వ్యయ అంచనాలు ఎవరినీ పుత్సాహ పరచడం లేదు. కొందరికి సంతృప్తినీ మరికొందరికి అసంతృప్తినీ కలిగించింది. ప్రభుత్వ పన్నుల విధానం పక్షపాత రహితంగా వుండలేక పోయింది. చక్కెర మీద, నూలు గుడ్డలు వగైరాల మీద ఎక్సైజ్ పన్నును పెంచడం ద్వారా మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం పెంచారు. ఇందువల్ల ప్రజల జీవన వ్యయ ప్రయాణం పెరిగే ప్రమాదం వుంది. తరుగుబడ్డెట్ల వల్ల ద్రవ్యోల్బణం ప్రమాదం లేకపోయినా ధరల పెరుగుదలను ప్రభుత్వం ప్రోత్సహించడం అన్యాయం. అభివృద్ధి కార్యాలకు ధనం కావలసిందే. అందుకు పన్నులు అవసరమే కాని, ఆ పన్నులు విధించడంలో ఆర్థిక మంత్రి వాస్తవిక పరిస్థితులను గుర్తించక పోవడం హర్షణీయం కాదు.

ఆహార ధాన్యాల ధర పడిపోకుండా చేస్తామని రైతులకు హామీ యివ్వడం హర్షించతగినదే. రైతు శ్రేయస్సుకు ఒక సమగ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించి అమలు చేయడం అవసరమై వుంది. మొత్తం ఆదాయంలో సగం రక్షణ కార్యక్రమాలకు వినియోగించడాన్ని కాదనలేము కాని ఈ పరిస్థితి ఎంతకాలం కొనసాగుతుందన్నదే ఆందోళన చెందవలసిన విషయం. ఆర్థిక బిల్లు శాసనమయ్యే లోగా పై సూచనల మేరకు పన్నుల సవరణ సమస్యల ఆకళింపు జరుగగలదని ఆశిస్తున్నాం.


ఎన్నెన్ని పాట్లు

4వ పేజీ కొరవ

బ్రిడ్జితో పాటు ఆత్మకూరు, ముత్తుకూరు బస్టాండ్లు, మాగుంట లేఔట్‌లోని అండర్ గ్రౌండ్ బ్రిడ్జిల్లో నీళ్లు నిలచి పోతాయి. నగరంలోని 12 రైల్వే లెవల్ క్రాసింగ్‌లలో ఆరింటి వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిల అవశ్యకత వుంది. ఒక కేంద్రమంత్రి, 8 మంది ఎమ్పీలు జిల్లా నుంచి లోక్‌సభ, రాజ్యసభలలో ప్రాతినిధ్యం వహిస్తున్నా లాలూను ఒప్పించి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిలకు నిధులు సాధించలేక పోయారు.

చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ఆత్మీయ సదస్సు

గుండె జబ్బులతో బాధపడే పేద పసి పిల్లలకు ఆపరేషన్లు చేయించే నిమిత్తం ఏర్పాటైన చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ఆత్మీయ సదస్సు 27తేది బొల్లినేని సూపర్ స్పెషాలిటి హాస్పిటల్‌లో జరిగింది. ఇప్పటి వరకు చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ద్వారా విరాళాలందించిన దాతలు ఆపరేషన్లు చేయించుకొన్న పిల్లలు, వారి తల్లితండ్రులు, పట్టణ ప్రముఖులు ఈ సదస్సుకు హాజరయ్యారు. బొల్లినేని హాస్పిటల్‌లో హృద్రోగ నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తప్ప, ఏ జిల్లాలోనూ గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించే సేవా సంస్థలు లేవన్నారు. చిన్నారి హార్ట్ ఫౌండేషన్ నేతృత్వంలో ఇప్పటి వరకు 23 మంది చిన్నారులకు ఆపరేషన్లు జరగడం సామాన్య విషయమేమీ కాదన్నారు. ఫౌండేషన్ ఛేర్మన్ కెవి రత్నం మాట్లాడుతూ తమ సంస్థ నిర్వహిస్తున్న ఈ మహా యజ్ఞానికి సహకరిస్తున్న బొల్లినేని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కరరావు అభినందనీయుడన్నారు. జిల్లాలోని 400 మంది గుండె జబ్బులు గల పిల్లలకు ఆపరేషన్లు చేయించడమే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. సంస్థ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ ఛేర్మన్ కెవి రత్నం వల్ల చిన్నారి సంస్థకు మంచి పేరుతో పాటు విరాళాలు కూడా ఎక్కువగా, అందుతున్నాయన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నెల్లూరు మాజీ ఎమ్మెల్యే జె రెడ్డి లక్ష రూపాయల చెక్కును కెవి రత్నంకు అందించారు. విజిఆర్ లెక్చరర్లు సరసారెడ్డి, బుజ్జమ్మ 5వేలు, జవాలజి లెక్చరర్ రత్నం 10వేలు, ఆంధ్రాబ్యాంకు డైరెక్టర్ సుధాకర్ 5వేల రూపాయలు ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌కు చెందిన సుధాకర్, ఎవి కృష్ణారెడ్డి, శాంతి చాల్ క్లైన్, బొల్లినేని హాస్పిటల్ డైరెక్టర్ గిరినాయుడు, ఫౌండేషన్ మీడియా ఇన్‌ఛార్జి పార్థసారధి నాయుడు పాల్గొన్నారు.



కావలిలోని విశ్వవినోదం వార్షికోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న ఆ సంస్థ అధ్యక్షుడు ఎస్వీ శేషయ్య

ప్రభుత్వ స్కూళ్లలో పాఠాలు చెప్పించండి

కొంతమంది ప్రభుత్వ ఎయిడెడ్ అధ్యాపకులు నిబంధనలకు విరుద్ధంగా వారు పనిచేసే స్కూళ్లకు వెళ్లకుండా, నెల్లూరులోని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో పనిచేస్తున్నారని ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం ఆరోపించింది. వీరిపై కఠిన చర్యలు తీసుకొని పేద, మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని ఫిబ్రవరి 26తేది డిఇఓను కలిసి కోరింది. మాస్టర్ బిఎడ్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు స్వతంత్రరెడ్డి, అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు వెంకట్, కలువాయి మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులని స్పష్టం చేశారు. అంతేకాకుండా నగరంలోని ఆదర్శ, కుట్టి, శ్రీదీప్తి, రాజు, గౌతమి కోచింగ్ సెంటర్లలో పనిచేసే పలువురు ఉపాధ్యాయులు స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లకుండా పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ ఉపాధ్యాయులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు పేర్నేటి కోటేశ్వరరెడ్డి కోరారు.

పొర్లుకట్ట

4వ పేజీ కొరవ

మరీ ధ్వంసమై పోయింది. నవలాకుల తోట నాలుగో మైలు సమీపంలో పొర్లు కట్టను ధ్వంసం చేసి పంట పొలాలుగా మార్చుకొన్నా సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లున్నారు. వచ్చే వర్షాకాలంలో పెన్నకు వరద వస్తే పలు గ్రామాలు మునిగిపోయే అవకాశం వుంది. ఇప్పటికైనా పొర్లుకట్ట మట్టిని తీసుకెళ్లకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

సతమతం

4వ పేజీ కొరవ

సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు సరాసరి పేదవాడికి అందడానికి పంచాయతీ కార్యదర్శి అవసరం. ఇప్పుడున్న రెవెన్యూ పనిభారం వల్ల కార్యదర్శి పంచాయతీ అభివృద్ధి పనులపై దృష్టి సారించలేక పోతున్నారు. తక్షణం ఈ వ్యవస్థలో మార్పుకు ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం అవసరం.

కిరోసిన్ తుస్

4వ పేజీ కొరవ

కారణంగా స్కానింగ్ బయట చేయిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు, లోక్‌సత్తా సభ్యులకు వివరించారు. పరిశుభ్రత లేకపోవడం, ఆస్పత్రిలో రోగులకు మందులివ్వక పోవడం, రక్తం దొరకక పోవడం, గర్భిణీ స్త్రీలకు పడకల కొరత వుండడం, క్రింది తరగతి వుద్యోగుల్లో అవినీతి, నిర్లక్ష్యాన్ని లోక్‌సత్తా గుర్తించింది. పరిస్థితులను చక్కదిద్దుకొంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అంజనీ బాయి, ఆర్ఎంఓ డాక్టర్ ఉషాకిరణ్ లోక్‌సత్తా సభ్యులకు హామీ ఇచ్చారు.

పుట్టిస్తా

9వ పేజీ కొరవ

అన్నమాట. సెక్సీగా వుండడమంటే శృంగార పరంగా కోరికలూరించే విధంగా వుండడం అనే అర్థం చెప్పుకోవచ్చు. నేను సెక్సీగా కన్పిస్తాను. మీరన్నట్లు నేను కాస్త లావెక్కాను. అయితే నా కళ్లు మరింత కైపెక్కాయంది కొంటెగా.

నా ఇష్టం

9వ పేజీ కొరవ

ఆమె తీసుకొన్న పారితోషికం 15లక్షలు. నాగార్జున కంటే వయస్సులో చిన్నదైన నదియా, అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో తల్లి పాత్రలో కన్పించనుంది.

డ్రస్‌లే ఇష్టం

9వ పేజీ కొరవ

గూర్చి చాలాసార్లు ప్రయత్నాలు జరిగాయి. కాని ఫలవంతం కాలేదు. ఇప్పుడు వీరి కాంబినేషన్‌లో చిత్రాన్ని తెరకెక్కించే ఘనతను జయభేరి కిషోర్ స్వంతం చేసుకొన్నారు. ఈ మధ్యకాలంలో ఎవరూ స్పృశించని నేపథ్యం, కథాంశాలతో ఈ చిత్రం రూపొందుతుందంటున్నారు.

పెళ్లి పందిరి

9వ పేజీ కొరవ

డుకోవడం అలవాటే. పెళ్లి తర్వాత సినిమాలు మానేస్తారా అంటే ప్రస్తుతం నా దృష్టంతా పెళ్లిమీదనే. అందుకే కొన్ని చిత్రాల్లో నటించేందుకు అవకాశం వచ్చినా అంగీకరించకుండా సున్నితంగా తిరస్కరించానంటుంది.

చిత్ర సమీక్ష

9వ పేజీ కొరవ

ఖచ్చితంగా చెప్పేస్తాడు. రాఘవ పట్టుదలతో తన కుటుంబ సభ్యులందరితో కూలిపని చేయించి నిలదొక్కుకుంటాడు. సూపర్ బజార్ వ్యాపారం ప్రారంభించి ఆర్థికంగా బలపడతాడు.

మరో అమ్మాయి (స్నేహ) సీతలాగా రాఘవ జీవితంలో ప్రవేశిస్తుంది. ఆమె అందరికీ అనుకూలంగా వుంటుంది. "ఎలా వచ్చేవమ్మా గులాబీలవానా, నువ్వే చెప్పవమ్మా చెలీ చందమామా" అంటూ తన జీవితంలో గులాబీలు విరబూసి పరిమళించినట్టు



నెల్లూరు సాహిత్య సదస్సు తరపున టౌన్‌హాల్‌లో రామాయణ మహోపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించిన పండితుడు మల్లప్రగడ శ్రీమన్నారాయణమూర్తిని సన్మానిస్తున్న గోసుకొండ వెంకటసుబ్బయ్య. గుర్రం విద్యావతి, పివిరమణారెడ్డి, సివిరామచంద్రరావు.

రాఘవ ఆనందపడి పోతాడు.

విష్ణు పెళ్లి చేసుకున్న కళ్యాణి (సంగీత) అసూయపరురాలు. రాఘవ, తమ్ముళ్లను మోసగించి పది లక్షలు దాచుకున్నాడన్న నేరాన్ని లేవనెత్తుతుంది. ఆ డబ్బు తన తమ్ముడు కూతురు ప్రాణాంతకమైన జబ్బు బాగు చేయించేందుకు దాచానని రాఘవ చెప్పడంతో ఆ నేరం తొలగిపోతుంది.

సాధారణమైన కథే ఇది. తెలుగులో మొదటి తరంలో నిర్మితమైన కుటుంబ కథా చిత్రాల్లాగా ఈ చిత్రం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉమ్మడి కుటుంబం గొప్పతనాన్ని అందులోని కుటుంబ సభ్యుల ఆప్యాయతాను బంధాల్నీ హృదయానికి హత్తుకునేలా దర్శకుడు చిత్రంలో చూపాడు. హృద్యమైన సెంటిమెంటు మిళితం చేశాడు. దుర్మార్గాన్ని కూడా మంచితనంతోనే గెలవాలి అనే వాతావరణాన్ని సున్నితంగా చూపాడు. మామూలు కథను పటుత్వమైన హంగులలో కొత్త పంథాలో సడిపి ప్రేక్షకులను కట్టి పడేశాడు.

వెంకటేష్‌కు రాఘవ పాత్ర విభిన్నమైంది. పెద్ద మనిషిలా వుండే పాత్రని చాలా హుందాగా పోషించాడు. చాలా సహజంగా నటించాడు. శ్రీకాంత్ చిరుకోపం ఆ తర్వాత మంచితనం చక్కగా ప్రదర్శించాడు. స్నేహ తెలుగింటి సంప్రదాయపు పిల్లలా ఆకట్టుకుంది. ఆర్తి అగర్వాల్ దూకుడుగా, అల్లరి పిల్లలా అలరించింది. ఎస్ఏ రాజ్‌కుమార్ సంగీతంలో పాటలు కమ్మదనం పులుముకున్నాయి. బాలమురుగన్ కెమెరా అభినందనీయం.

తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించే "సంక్రాంతి" పండగను సంవత్సరానికొకసారి ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకుంటారు. అలాగే సంతోషంగా ప్రతిరోజూ కుటుంబ సభ్యులంతా ఆప్యాయంగా సంక్రాంతి జరుపుకోవడం అవసరమని ఈ చిత్రం చెప్తుంది.

Statement about ownership and other particulars about the Newspaper

ZAMIN RYOT (TELUGU WEEKLY)

NELLORE - 524 001, ANDHRA PRADESH

FORM - IV (See Rule 8)

1.	Place of Publication	:	D.No. 16/339, 2nd Floor Upstairs, Venkataramana Vilas Trunk Road, NELLORE - 524 001
2.	Periodicity of Publication	:	Weekly
3.	Printer's Name Nationality & Address	:	N. Dolendra Prasad Indian 16-3-629, Ramamurthy Nagar NELLORE - 524 003
4.	Publisher's Name Nationality & Address	:	- do -
5.	Editor's Name Nationality & Address	:	- do -

6. Name and Addresses of the individuals who own the newspaper and partners or share holders holding more than one percent of the total capital.

ZAMINRYOT COMMITTEE

1.	Sri T. Vanamali Flat No:302, Himagiri Towers Side of Kalyan Nagar - Venture III Bus Stand Mothi Nagar, Hyderanbad - 500 018	:	Member
2.	Sri N. Dolendra Prasad 16-3-629, Ramamurthy Nagar Nellore - 524 003	:	Member
3.	Sri N. Yamini Chandra Zamin Ryot Bldgs., 1st Street, Chandramouli Nagar NELLORE - 524 004	:	Member
4.	Sri N. Kosalram Flat No:5, C-Block, 3rd Floor Silver Park Aparments 36, Thanikachalam Road, T.Nagar, CHENNAI - 600 017	:	Member

I, N. Dolendra Prasad hereby declare that the particulars given above are true to the best of my knowledge.

N. DOLENDRA PRASAD, Publisher

లంచాల చేప

5వ పేజీ కొరవ

లక్షల బాండ్లు కలువాయిలో 10ఎకరాల పొలం డాక్యుమెంట్లు కనుగొన్నారు. ఇంకా పలు డాక్యుమెంట్లు దాచిసినట్లు ఎసిబి అధికారులు చెప్పారు. శ్రీనివాస రాజును అదుపులో తీసుకొని ఎసిబి కోర్టుకు తీసుకొచ్చినప్పుడు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆస్తులన్నీ తాను కష్ట పడి సంపాదించినట్లు చెప్పాడు. లంచం తీసుకోవడం కూడా కష్టపడి సంపాదించడ మనేది రాజు గారి భావన కాబోలు.

కలువాయి బస్టాండులో వ్యభిచారం జోరు

కలువాయి బస్టాండు కేంద్రంగా వ్యభిచారం జోరుగా సాగుతోంది. బస్టాం డులోని కూల్‌డ్రింక్ షాపులే కాక, పలు దుకాణాలు చీకటి పడేసరికి బార్ అండ్ రెస్టారెంట్లుగా మారుతున్నాయి. బస్టాండు లోని అంగళ్ల వెనుక వ్యభిచారం సాఫీగా జరిగి పోతూంది. దీనివల్ల బాగా పొద్దు పోకముందే బస్టాండులోని కొన్ని షాపులు మందు బాబులతో రద్దీగా వుంటు న్నాయి. అర్ధరాత్రయ్యే సరికి అంగళ్లు మూసినట్టుగా కన్పిస్తున్నా లోపల మందు, మగువలతో నిషా, ఖుషీ కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగి పోతున్నాయి. నిత్యావసర సరకుల కొనుగోలు నిమిత్తం చుట్టుప్రక్కల గ్రామాల మహిళలు రోజూ కలువాయికి వచ్చి వెళ్లడం పరిపాటి. చీకటి పడిన తర్వాత వీళ్లు బస్సుల కోసం బస్టాండులో వేచి వుండాలంటే జరుగుతున్న సంఘటనలతో భయపడి పోతున్నారు. కలువాయి పోలీసులకు ఇదంతా తెలియకుండా జరుగుతుందా అనేదే సందేహం.

ఆర్యవైశ్య సంఘ నాయకునిగా ఆనందకృష్ణ

జిల్లా ఆర్యవైశ్య సంఘాధ్యక్షునిగా గూడూరుకు చెందిన పోకూరి ఆనందకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం మాజీ అధ్యక్షుడు వాకాటి తిరుపాలు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

సైన్స్ ఉపాధ్యాయుని ఘనత

నాయుడుపేట మండలం బిరద వాడ ప్రాథమికోన్నత పాఠశాల ఉపా ధ్యాయుడు మోచర్ల మోహన్‌రావు పిల్ల లకు సైన్స్ పాఠాలు చెప్పడమే కాక, కేవలం 800రూపాయల ఖర్చుతో రేడియో రిలే కేంద్రానికి రూపకల్పన చేశారు. ఈ కేంద్రం ద్వారా కిలోమీటరు దూరం వరకు ప్రసారాలను చేయవచ్చు. ఇనుప కమ్ములతో తయారు చేసిన యాంటినాకు బ్రాడ్ కాస్టింగ్ పరికరాన్ని అనుసంధానం చేయడంతో కిలోమీటరు పాటు ప్రసారాలు విన్పిస్తున్నాయి. యాంటినా ఎత్తు పెంచితే పది కిలోమీ టర్ల వరకు ప్రసారాలు వినవచ్చుంటు న్నారీ టీచర్. ఇదే కాకుండా కేవలం 120 రూపాయల ఖర్చుతో ఆటోమేటిక్ సెన్సార్ పరికరం తోపాటు, స్విచ్ లేకుండా కాలింగ్ బెల్‌ను, కుర్చీలో కూర్చుంటే ఆటోమేటిక్‌గా ఫ్యాన్ తిరిగే పరికరం, పొలంలో వ్యవసాయ ఉత్ప త్తులు దొంగలపరం కాకుండా పొలంలోకి మనిషి ప్రవేశించగానే ఉనికిని కనిపెట్టే పరికరాలను మోహన్‌రావు తక్కువ ఖర్చుతో తయారు చేశారు. ఈ పరికరా లన్నీ సూర్యరశ్మిపై ఆధారపడి పని చేస్తాయి. ప్రభుత్వం ప్రోత్సహిస్తే కొం గొత్త ఆవిష్కరణలు చేస్తానంటున్న ఈ ఉపాధ్యాయుడ్ని ప్రోత్సహించాల్సి వుంది.

కావలిలో రోటరీ కార్యక్రమాలు

రోటరీ క్లబ్‌ను స్థాపించి నూరేళ్లు పూర్తయిన సందర్భంలో కావలి రోటరీ క్లబ్ పలు కార్యక్రమాలు చేపట్టింది. 23తేది స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వ హించారు. 42 మంది ఈ సందర్భంగా రక్తదానం చేశారు. సాయంత్రం ఎఎన్‌ఆర్ కళ్యాణ మండపంలో రోటేరియన్లు కుటుంబ సమ్మేళన కార్యక్రమం నిర్వహిం చారు. డాక్టర్ లక్ష్మీ నరసారెడ్డి రోటరీ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కావలిలో క్లబ్‌ను డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి 1974లో స్థాపించారు. 4బస్ షెల్టర్లు, 4బోరు బావులు, వాటర్ ప్రాజెక్టు, అని యత విద్యాకేంద్రం, కుట్టు శిక్షణా కేం ద్రంతో పాటు మురికివాడల అభివృద్ధికి బాగా శ్రమించారు. ఇంతేగాక రెడ్‌క్రాస్ నేతృత్వంలో బ్లడ్ బ్యాంకు నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు విరాళ మిచ్చినట్లు వివరించారు. రోటరీ క్లబ్ కార్యదర్శి ఎస్వీ కామేశ్వరరావు క్లబ్ ప్రగతి నివేదిక చదివారు.



పేద పిల్లలకు గుండె ఆపరేషన్ల నిమిత్తం చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ఛేర్మన్ కె.వి.రత్నంకు రెండు లక్షల 11వేల రూపాయల విరాళాన్నందిస్తున్న శాంతిలాల్ జైన్, శంకర్‌లాల్‌జైన్.



డాక్టర్ ఐ.అనిల్ కుమార్ రెడ్డి
అనిల్ డయాబెటిస్ సెంటర్,
పొగతోట, నెల్లూరు

శుభాకాంక్షలు

అత్యంత ప్రతిష్టాత్మకమైన
మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు 6సం॥ల
పాటు కౌన్సిల్ మెంబర్‌గా ఆంధ్ర ప్రదేశ్
నుంచి నియమితులైన మా ఆత్మీయులు

డా॥ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి గారికి

హృదయ పూర్వక శుభాకాంక్షలు

డా॥పి.ఎల్.రావు M.S.F.P.S.M.(Madurai)
డా॥ పి.భారతి, D.O.(Madurai). F.A.M.S.(Coimbatore). F.P.M.S.(USA)
డా॥ ఓ.గోపాలకృష్ణ M.S., F.A.C.S. (USA)
డా॥ బి.కృష్ణమూర్తి B.Sc., M.B.B.S., D.O.

MODERN EYE HOSPITAL
మోడరన్ 'ఐ' హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్
16-II-101, హోటల్ వెంకటరమణ ప్రక్కవీధి,
పొగతోట, నెల్లూరు - 524 001.
ఫోన్స్: 0861 - 2324868, 2306015



స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
నిర్యాణం: 6-03-2001

చతుర్థ వర్ధంతి

పూజ్యులు
స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

స్వర్గస్తులై 6.03.2005 నాటికి
నాలుగు సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా
వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: వేమిరెడ్డి శ్యామలమ్మ
కుమారుడు: వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
కాంట్రాక్టర్,
రామ్మూర్తినగర్, నెల్లూరు.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.